# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 25 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 171 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


**గోల్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో సీఎం**



7

**ఏపీఎల్‌కు రామ్‌చరణ్ మెరుపు**



5



## లోకేష్‌గళం.. మౌనమేలా...?

సినీ ఇండస్ట్రీలో ఉన్ననేనే ఏ రోజు మేకప్ వేసుకోని మాట్లాడలేదు

హోంమంత్రి మహిళల రక్షణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరెశ్యామలరెడ్డి

రెడ్ బుక్ పాలనలో మహిళలకు రక్షణ ఏది?

కూటమిపై ధ్వజమెత్తిన వైసీపీ శివంగిలు

2

## బీసీలను అగ్రపథాన నిలబెడతాం



రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

- గురుకులాలతో బీసీలకు అత్యున్నత విద్య
- కొత్తగా మరో 10 ఎంజేపీల ఏర్పాటు
- కూటమి రాకతో బీసీలకు మంచి రోజులు
- అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్ల ఏర్పాటు
- గత ప్రభుత్వంలో అక్రమాలకు శిక్ష తప్పదు

5



# ఒకప్పుడు కేజీఎఫ్.. ఇకపై జొన్నగిరి!

## నవ్యాంధ్రకు బాబు 'బంగారు' బాట

## జొన్నగిరి మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం

**కర్నూలు జిల్లా జొన్నగిరిలో సీఎం నారా చంద్రబాబు స్వర్ణ అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. రాయలసీమను 'రతనాల సీమ'గా మారుస్తామన్నారు... దేశంలోనే మొదటి ప్రైవేట్ గోల్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించిన ఏపీ ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి ఇది సువర్ణాధ్యాయం అన్నారు.**

(అమరావతి, పి. మీరా హుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో రూ.405 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ రంగానికి చెందిన బంగారు గని, శుద్ధి కర్మాగారాన్ని (గోల్ మైనింగ్ అండ్ ప్రాసెసింగ్ ప్రాజెక్ట్) ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేసిన ఉత్పత్తి విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా బంగారం ఉత్పత్తి చేసే ప్రక్రియను సీఎం ప్రారంభించి, అనంతరం ప్రాజెక్టు రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చేలా తన ప్రసంగంతో స్థానికుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. జొన్నగిరి కాదు.. ఇకపై ఇది 'సువర్ణగిరి' అన్నారు.'ఈ ప్రాంతాన్ని వందల ఏళ్ల క్రితం సువర్ణగిరి అని పిలిచేవారు. ఇది అశోకుడి నాలుగో రాజధాని. కాలక్రమేణా జొన్నగిరిగా మారింది. పూర్వ వైభవాన్ని గుర్తు చేస్తూ మళ్లీ ఇక్కడ బంగారం నిక్షేపాలు బయటపడ్డాయి. దీనిని మనం మళ్లీ 'సువర్ణగిరి'గా మార్చుకుందాం. ఒకప్పుడు దేశంలో బంగారం అనగానే కేజీఎఫ్ (కోలార్ గోల్ ఫీల్డ్స్) గుర్తొచ్చేది.. ఇకపై దేశవ్యాప్తంగా జొన్నగిరి పేరు మారుమోగుతుంది' అని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. కరువు సీమగా మారిన రాయలసీమకు

...మిగతా 2లో

## మత్స్యకార కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటాం

### పులిగడ్డలో మత్స్యకార కుటుంబాలతో మంత్రి లోకేష్ మాటామంతీ

### మత్స్యకారులతో కలిసి పడవలో ప్రయాణం



(పులిగడ్డ నుండి పి.మీరాహుస్సేన్ మనం ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్రంలో మత్స్యకార కుటుంబాలకు ప్రజాప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. బుధవారం కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా అవనిగడ్డ మండలం పులిగడ్డ పల్లెపాలెంలోని మత్స్యకార కుటుంబాలతో నారా లోకేష్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

...మిగతా 2లో

## పులివెందుల పర్యటనలో వైయస్ జగన్‌కు బ్రహ్మరథం

### అడుగడుగునా అభిమానుల కేరింతలు.. షెడ్యూల్ కంటే ఆలస్యంగా సాగిన పర్యటన

### పులివెందులలోని నివాసంలో చిన్నారికి దైవిక అని నామకరణం చేసిన వైయస్ జగన్



(పులివెందుల, మనం న్యూస్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పులివెందుల పర్యటనలో అభిమానులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా అభిమానులు అడ్డుకుని ఆప్యాయంగా పలకరించడంతో ఆయన పర్యటన షెడ్యూల్ కంటే ఆలస్యంగా సాగింది. ఉదయం భూమయ్యగారిపల్లె గ్రామంలోని గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జరిగిన కలశ స్థాపన, సుదర్శన హోమం కార్యక్రమాల్లో వైయస్ జగన్ పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దీవెనలు భక్తులందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

అనంతరం ఇటీవల మృతిచెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు ఓబుళరెడ్డి శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి

...మిగతా 2లో

## నూతన పాలసీతో అరుదైన వ్యాధిగ్రస్తులకు స్వాంతన

### విశాఖ, కర్నూలు, తిరుపతిలో రిఫరల్ సెంటర్లు

### జులై తొలివారంలో ఔషధ కంపెనీల వారితో ప్రత్యేక సదస్సు

### రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

### విజయవాడలో 'అరుదైన వ్యాధులు. చికిత్స'పై కార్యశాల

విజయవాడ,జూన్,24,(మనం ప్రతినిధి): అరుదైన వ్యాధిగ్రస్తులకు చికిత్స, ఆర్థికపరంగా భరోసా ఇచ్చేలా కొత్త పాలసీని తయారుచేయబోతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా

...మిగతా 2లో

**చెత్త నుంచి తయారు చేసే కాంపోస్ట్‌లో పోషక విలువల పెంపునకు శాస్త్రవేత్తలతో కమిటీ**

2

**లోకేష్‌ను కలిసి స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్**



2

## కొక్కిలగడ్డలో శ్రీ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి నారా లోకేష్



మోపిదేవి: జూన్ 24,మనం న్యూస్: కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం, కొక్కిలగడ్డలో బుధవారం జడ్పీ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన అనంతరం గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయాన్ని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. ముందుగా

...మిగతా 2లో

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నాకు పునర్జన్మ ఇచ్చింది

### కొక్కిలిగడ్డలో మంత్రి నారా లోకేష్ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన మహిళ



కొక్కిలిగడ్డ,జూన్, 24,(మనం న్యూస్): క్యాన్సర్స్ తో పోరాడుతున్న ఎంతోమంది నిరుపేదలకు అండగా నిలిచి వారి ప్రాణాలు నిలిపింది బసవతారకం ఆసుపత్రి. ప్రాణాంతక

...మిగతా 2లో

## పోలవరం మట్టి దోపిడీ వైసీపీ హయాంలోనే

### ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ తూర్పు జూన్ 24(మనం న్యూస్): పోలవరం కుడి కాలువ మట్టి దోపిడీ వ్యవహారంపై వైసీపీ నేతలు, సాక్షి మీడియా చేస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని విజయవాడ

...మిగతా 2లో



## సమాజంలో మార్పు తెచ్చేందుకే విద్యాశాఖను ఎంచుకున్నా!

అంతా కలిసి ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ సాధిద్దాం

సంస్కరణలు పూర్తయ్యాయి, ఇక బోధనపైనే టీచర్లు శ్రద్ధ వహించాలి

విద్యార్థులు చదవకపోతే ముఖ్యమంత్రి నాకు మైనస్ మార్కులు వేస్తారు

మోపిదేవి హైస్కూలు నూతన భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్

2

## విద్యా - వైద్య వికసిత్ భారత్- స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో పల్నాడు జిల్లా అగ్రగామిగా నిలవాలి

### 20 సూత్రాల పథకం చైర్పర్సన్ లంకా దినకర్





నర్సరావుపేట, జూన్ 24,(మనం న్యూస్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమైన 'స్వర్ణాంధ్రప్రదేశ్', ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పమైన 'వికసిత్ భారత్' ఆశయాలను అనుసంధానిస్తూ,

...మిగతా 2లో

# ఒకప్పుడు కేజీఎఫ్.. ఇకపై జొన్నగిరి!

(మొదటి పేజీ తరువాయి)

సాగునీరు అందించి ప్రాణం పోసింది స్వర్గీయ ఎన్టీఆర్. సీమను రతనాల సీమగా మార్చాలనే సంకల్పం జొన్నగిరి నుంచే ప్రారంభమైంది. చమురు (ఆయిల్) తర్వాత మన దేశం విదేశాల నుంచి అత్యధికంగా దిగుమతి చేసుకునేది బంగారమే. అలాంటిది మన సొంత గడ్డపై బంగారం ఉత్పత్తి కావడం రాష్ట్ర ఆర్థిక రంగానికి ఎంతో కీలకం' అని పేర్కొన్నారు.వేలాది మందికి ఉపాధి అవకాశాలు: 'జియో మైసూర్, డెక్కన్ గోల్ మైన్స్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 800 మందికి పైగా ఉపాధి లభించింది. త్వరలోనే ఈ సంఖ్యను 1500కు పెంచుతాం. భవిష్యత్తులో మైనింగ్ విస్తరణ ద్వారా స్థానిక యువతకు దాదాపు 5 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి' అని ముఖ్యమంత్రి ప్రకటించారు.ఏటా 2 టన్నుల బంగారం ఉత్పత్తి లక్ష్యం: 'మొదటి విడతగా ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 400 కిలోల బంగారం ఉత్పత్తి అవుతుంది. రాబోయే రోజుల్లో దీనిని 900 కిలోలకు, ఆ తర్వాత ఏడాదికి 2 టన్నుల మేర బంగారం ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ ఉత్పత్తి ద్వారా వచ్చే విలువపై 4 శాతం రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుంది.' అని సీఎం వివరించారు.

జగన్ కుట్రలపై తీవ్ర విమర్శలు: ఈ సభలోనే సీఎం చంద్రబాబు విపక్ష నేత జగన్ మోహన్ రెడ్డిపై రాజకీయంగా విమర్శలు గుప్పించారు. 'గత ప్రభుత్వం వేధింపుల కారణంగానే ఈ మైనింగ్ ప్రాజెక్టు ఇన్నాళ్లూ ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో అన్ని క్లియరెన్సు ఇచ్చి దీనిని ప్రారంభించాం. తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి జగన్ రోజూ కులం, మతం, ప్రాంతం పేరుతో రాష్ట్రంలో చిచ్చులు పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారు' అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులు, జియో మైసూర్ సంస్థ ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మత్స్యకార కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

పులిగడ్డ పల్లెపాలెంలోని నాయుడు వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి మౌనిక, సింగోతు సుధీర్, సతీమణి శివపార్వతితో పాటు ఎస్.నరసింహస్వామి, కే.మశేన్ రావులతో మాట్లాడారు.

### వల విసిరి చేపల వేట

పులిగడ్డలోని మత్స్యకార కుటుంబాలతో కలిసి వేణిపాయలో మంత్రి నారా లోకేష్ స్వయంగా పడవలో ప్రయాణించారు. మత్స్యకారుల జీవన స్థితిగతులను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. బోట్ల తయారీ, వినియోగం, చేపట వేట, అమ్మకం, ఆదాయం, కుటుంబ స్థితిగతులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చేపల వేట నిషేధ సమయంలో ప్రజాప్రభుత్వం అందిస్తున్న మత్స్యకార భరోసాపైనా మంత్రి ఆరా తీశారు.

### పడవ కొనుగోలుకు రూ.2.50 లక్షలు

చిన్న పడవల కొనుగోలుకు ఒక్కో పడవకు రూ.2.50 లక్షలు, పెద్ద పడవకు రూ.7.50 లక్షల వరకు వ్యయం అవుతుందని మత్స్యకారులు మంత్రికి వివరించారు. ఇక్కడపెద్ద బోట్లు నడవవని, చిన్న బోట్లను మాత్రమే వినియోగిస్తామని తెలిపారు. నెల్లూరులో బోట్లు తయారీ ఉందని వివరించారు. ఉదయం 2 నుంచి 3 గంటల సమయంలో చేపల వేటకు బయలుదేరి 9 గంటలకు తిరిగివస్తామని తెలిపారు. వలల్లో 15 రకాలు ఉంటాయని, వలలో పడిన చేపలను స్థానిక కంపెనీలకు విక్రయిస్తామన్నారు. కుటుంబానికి నెలకు రూ.20వేల వరకు సంపాదన ఉంటుందని, గ్రామంలో 300 మంది వరకు మత్స్యకారులు ఉన్నారని చెప్పారు. తమ గ్రామంలో ప్రస్తుతం రిజిస్టరైన చిన్న బోట్లు 60,, పెద్ద బోట్లు 15 వరకు ఉన్నాయని వివరించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తమ పిల్లలు చదువుతున్నారని మత్స్యకారులు తెలిపారు. అనంతరం మంత్రి లోకేష్ స్వయంగా వలవేసి చేపలను పట్టారు.

### ఆయిల్ సబ్సిడీ పెంచాలి

తాము వినియోగించే బోట్లకు గత కొన్నేళ్లుగా లీటర్ డీజిల్ పై రూ.9 సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని, దీనిని రూ.25 నుంచి రూ.30 వరకు పెంచాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు. వలలు, బోట్లు, ఇంజన్ కొనుగోలుపై సబ్సిడీ ఇవ్వాలని కోరారు. వరదల సమయంలో ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుతో పాటు వలల కోసం షెల్టర్స్, రాత్రి సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఫ్లడ్ లైట్లను ఏర్పాటుచేయాలని కోరారు. మత్స్యకార కుటుంబాలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువగళం పాదయాత్ర జువ్వలదిన్నెకు చేరుకున్నప్పుడు మత్స్యకారుల ఐకమత్యం, చూపించిన ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. మత్స్యకారుల ఆదాయం పెంపునకు కృషి చేస్తామని, ప్రజాప్రభుత్వంలో అన్ని విధాలా అండగా ఉంటుందని లోకేష్ భరోసా ఇచ్చారు.

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నాకు పునర్జన్మ ఇచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

క్యాన్సర్‌తో పోరాడుతున్న తనకు హైదరాబాద్ లోని బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి పునర్జన్మ ఇచ్చిందని కొల్లి దమయంతి మంత్రి నారా లోకేష్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం, కొక్కిలిగడ్డలో జడ్పీ స్కూల్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి నారా లోకేష్ ను అదే గ్రామానికి చెందిన 60 ఏళ్ల కొల్లి దమయంతి కలిశారు. క్యాన్సర్ వ్యాధిబారిన పడిన తాను రెండేళ్ల క్రితం హైదరాబాద్ లోని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నానని మంత్రికి వివరించారు. నాణ్యమైన వైద్యసేవలు తక్కువ ఖర్చుతో అందించారని.. అక్కడి వైద్యులు, సిబ్బంది తనను ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి నుంచి పూర్తిగా కోలుకుని ప్రస్తుతం ప్రశాంత జీవితం గడుపుతున్నానని ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ.. బాలయ్య మావయ్య బసవతారకం ఆసుపత్రిని సమర్థంగా నిర్వహిస్తున్నారని, ఎంతోమంది పేదలకు అండగా ఆసుపత్రి నిలిచిందన్నారు.

# లోకేష్‌గళం.. మౌనమేలా...?

(అమరావతి, పి. మీరా హుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వైయస్‌ఆర్‌సీపీ మహిళా నేతలు మహిళా కమిషన్ కార్యాలయం వద్ద బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకురాళ్లు ఉప్పాల హారిక, భాగ్యలక్ష్మి, ఆరె శ్యామల, పుణ్యశీల కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్లో మహిళల భద్రత పూర్తిగా గాలికి కొట్టుకుపోయిందని, కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని వైయస్‌ఆర్‌సీపీ మహిళా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయం వద్ద వైయస్‌ఆర్‌సీపీ మహిళా ప్రతినిధులు ఉప్పాల హారిక, భాగ్యలక్ష్మి, ఆరె శ్యామల, పుణ్యశీల సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలపై మహిళా కమిషన్ తక్షణమే స్పందించి సుమోటోగా కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా వైఫల్యం చెందిందని వైయస్‌ఆర్‌సీపీ నేతలు ఆరోపించారు. బీసీ మహిళా నేత ఉప్పాల హారికపై జరిగిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు.మహిళా కమిషన్ మౌనంపై ప్రశ్నలు సంధించారు.సామాజిక మాధ్యమాల్లో దాడులకు సంబంధించిన ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నా మహిళా కమిషన్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత మహిళల రక్షణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.మీడియా సమావేశంలో వైయస్‌ఆర్‌సీపీ మహిళా నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని, వైయస్‌ఆర్‌సీపీ నాయకురాళ్లను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పగటిపూట నడిరోడ్డుపై మహిళలపై దాడులు జరుగుతున్నా పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.బీసీ నేత ఉప్పాల హారికపై జరిగిన అమానుష దాడిని ప్రస్తావిస్తూ, నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా నిలవాల్సిన మహిళా కమిషన్, అధికార పక్ష ఒత్తిళ్లకు తలొగ్గి మూగప్రేక్షకుడిలా మారిందని విమర్శించారు. హోంమంత్రిగా ఒక మహిళ ఉండి కూడా రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలు పక్కనబెట్టి, మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వైయస్‌ఆర్‌సీపీ మహిళా నేతలు హెచ్చరించారు.

# సమాజంలో మార్పు తెచ్చేందుకే విద్యాశాఖను ఎంచుకున్నా!

(కొక్కిలిగడ్డ (అవనిగడ్డ): జూన్ 24, మనం న్యూస్) సమాజంలో మార్పు తెచ్చేందుకే నేను అత్యంత కఠినమైన విద్యాశాఖను ఎంచుకున్నాను. దీనిని నేను ఛాలెంజ్ గా స్వీకరించాను. విద్యావ్యవస్థలో మార్పు తేవడం ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమవుతుంది. దేశంలోనే ఆదర్శవంతంగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీసుకురావాలన్నది నా ధ్యేయం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో పి4 పథకంలో భాగంగా దాతల సహకారంతో రూ.1.4కోట్లతో నూతనంగా నిర్మించిన జెడ్పీ హైస్కూలు నూతన భవనాలను బుధవారం ఉదయం మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ కొక్కిలిగడ్డ హైస్కూలు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ... గత రెండేళ్లలో విద్యావ్యవస్థలో సంస్కరణలన్నీ పూర్తి చేశాం, ఇక ఉపాధ్యాయులంతా పూర్తిగా ఫలితాలపైనే శ్రద్ధ వహించాలని సూచించారు. నేను విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాం. రాష్ట్రవ్యాప్తంగా హార్డ్ వేర్ (ఇన్ ఫ్రా) మెరుగైంది, సాఫ్ట్ వేర్ (లెర్నింగ్ అవుట్ కమ్స్) మెరుగు పర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. కొక్కిలిగడ్డ హైస్కూలులో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ తప్ప అన్ని సౌకర్యాలు కల్పించాం. అభ్యసనా ఫలితాల మెరుగుదలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి. ఫార్మేటివ్, సమ్మేటివ్ టెస్ట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపర్చాలి. వెనుకబడిన విద్యార్థుల పనితీరును మెరుగుపర్చేందుకు బ్రిడ్జి కోర్సు మెటీరియల్ ను అందజేస్తాం. వివిధ తరగతుల్లో వెనుకబడిన పిల్లలు ఏ సబ్జెక్టుల్లో బలహీనంగా ఉన్నారో తెలుసుకొని, అటువంటి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి. నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు.

### తొలిసారిగా ప్రభుత్వ స్కూళ్ల ఫలితాలతో యాడ్స్

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల చిత్రాలతో పత్రికల్లో యాడ్స్ ఇచ్చామని మంత్రి లోకేష్ చెప్పారు. గత విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ వస్తున్నాం. టీచర్లు ఇక పూర్తిస్థాయిలో బోధనపైనే శ్రద్ధ వహించాలి. ఉపాధ్యాయులు తమ రోజువారీ విధినిర్వహణలో ఏదైనా సమస్య తలెత్తితే మీరు ఎంఇఓ, డిఇఓలకు వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు, లీప్ యాప్ ద్వారా నేరుగా నాకు చెప్పొచ్చు. వచ్చేనెల 16,17,18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పేరెంట్ - టీచర్ మీటింగ్ సమావేశాలను నిర్వహించాలని భావిస్తున్నాం. ఉపాధ్యాయులంతా చొరవ తీసుకొని తల్లిదండ్రులను చైతన్యపర్చి లీప్ యాప్ డౌన్ లోడ్ చేయించండి. విద్యావ్యవస్థలో నేను అనుకున్నది సాధించాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సహకారం అవసరం. అందరి సమిష్టికృషితోనే అత్యుత్తమ ఫలితాలు రాబట్టగలుగుతాం. అందరం టీమ్ వర్క్ గా పనిచేసి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సాధిద్దాం.

## లోకేష్‌ను కలిసి స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్

అమరావతి, జూన్ 24 (మనం న్యూస్): ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సాత్విక్ సాయిరాజ్ ను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సాత్విక్ సాయిరాజ్ అర్జున అవార్డుతో పాటు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు పొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించారు. ప్రస్తుతం పురుషుల డబుల్స్ విభాగంలో ప్రపంచ ర్యాంకింగ్స్లో 4వ స్థానంలో ఉన్నారు. 2023 అక్టోబర్ 10న డబుల్స్ విభాగంలో ప్రపంచ నంబర్-1 ర్యాంకును సాధించారు. ఇటీవల జరిగిన థామస్ కప్ లో గోల్ మెడల్ సాధించడం పట్ల మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో సాత్విక్ సాయిరాజ్ మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ ఎస్.భరణి పాల్గొన్నారు.

# పోలవరం మట్టి దోపిడీ వైసీపీ హయాంలోనే

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మట్టి అక్రమాలనే కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

సాక్షి పత్రికలో ప్రచురితమైన ఫొటోలు తాజాగా తీసినవి కాదని, అవి 2023 ఫిబ్రవరి 9న వైసీపీ పాలనలో తీసినవేనని ఆయన పేర్కొన్నారు. అప్పట్లో జరిగిన అక్రమ మట్టి తరలింపులకు సంబంధించిన ఆధారాలను ఇప్పుడు కొత్తవిగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఫొటోలు, కేసులు, ఘటనలు అన్నీ వైసీపీ హయాంలో జరిగినవేనని, వాటికి సమాధానం చెప్పాల్సింది ఆ పార్టీ నాయకత్వమేనని అన్నారు.పోలవరం పేరుతో రాష్ట్ర సంపదను దోచుకున్నవారే ఇప్పుడు నీతులు చెబుతున్నారని చిన్ని విమర్శించారు. వైసీపీ పాలనలో కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమంగా తరలించబడిందని, దీనిపై గతంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ), హైకోర్టుల్లో కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. కోర్టు రికార్డులు, డిజిటల్ ఆధారాలు ఉన్నప్పటికీ వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు.మట్టి దోపిడీ వ్యవహారంలో వైసీపీకి చెందిన పలువురు కీలక నేతల పాత్రపై అనుమానాలు ఉన్నాయని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే సీబీఐ లేదా ఈడీ విచారణ కోరాలని సవాల్ విసిరారు. గూగుల్ టేకౌట్ రికార్డులు, జీపీఎస్ లొకేషన్లు, ఇతర సాంకేతిక ఆధారాలు వెలుగులోకి వస్తే అసలు నిజాలు బయటపడతాయని పేర్కొన్నారు.

దేవినేని అవినాష్, కేశినేని నానీ, వైసీపీ అధినేత జగన్మోహన్రెడ్డిపై కూడా చిన్ని విమర్శలు గుప్పించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అండతో రాజకీయంగా ఎదిగిన నాయకులు ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేయడం విచారకరమన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చిన్ని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు సాగునీరు అందించేందుకు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంపై దృష్టి సారించారని చెప్పారు. పోలవరం మట్టి దోపిడీ వ్యవహారంలో నిజాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని, ఫేక్ ప్రచారాలతో వాస్తవాలను దాచలేరని హెచ్చరించారు.

# పులివెందుల పర్యటనలో వైయస్ జగన్‌కు బ్రహ్మారథం

(మొదటి పేజీ తరువాయి)

వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భూమయ్యగారిపల్లె నుంచి పులివెందులకు బయలుదేరిన వైయస్ జగన్కు మార్గమధ్యంలో పెద్ద ఎత్తున అభిమానులు స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో అభిమానులు, మహిళలు, యువత, వృద్ధులు ఆయనను చూసేందుకు తరలివచ్చారు. ప్రతి ఒక్కరి వద్ద ఆగి పలకరిస్తూ, అభిమానుల కోరిక మేరకు సెల్ఫీలు దిగుతూ ముందుకు సాగారు. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు పులివెందుల చేరుకోవాల్సిన ఆయన సాయంత్రం 4.30 గంటలకు అక్కడికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ఓ చిన్నారికి అక్షరాభ్యాసం చేయించి ఓనమాలు దిద్దించారు. చిన్నారిని ఆశీర్వదిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మరోవైపు యువత పెద్ద ఎత్తున సెల్ఫీల కోసం ఉత్సాహం చూపించగా, వాహనం వెంట యువకులు భారీ సంఖ్యలో ప్రయాణిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వేల్పుల సమీపంలో అంబులెన్స్ సైరన్ వినిపించగానే వైయస్ జగన్ తన కాన్వాయ్ను వెంటనే పక్కకు ఆపించి రూట్ క్లియర్ చేయించారు. అత్యవసర సేవలకు ప్రాధాన్యత ఇస్తూ ఆయన వ్యవహరించిన తీరు అక్కడి ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని యర్రగుడిపల్లెలో సీసీ రోడ్లను ప్రారంభించారు. పర్యటన సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ టీచర్లు వైయస్ జగన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1800 మంది పార్ట్‌టైమ్ టీచర్లు పనిచేస్తున్నప్పటికీ ఏడాదికి కేవలం ఎనిమిది నెలల వేతనం మాత్రమే అందుతోందని, రెగ్యులర్ ఉద్యోగుల కంటే అధిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పులివెందుల నివాసంలో ఓ చిన్నారికి 'దైవిక' అని నామకరణం చేశారు. చిన్నారిని ఆశీర్వదించి ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. పర్యటన మొత్తం ప్రజలతో మమేకమవుతూ, అభిమానుల ప్రేమాభిమానాలకు అభివాదం చేస్తూ సాగిన వైయస్ జగన్ పర్యటన పులివెందులలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించింది.

## కొక్కిలగడ్డలో శ్రీ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి నారా లోకేష్



(మొదటి పేజీ తరువాయి)

ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు ఆలయ పండితులు ఘనస్వాగతం పలికారు. అనంతరం శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రి లోకేష్ కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, వైద్య బీమా సేవల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, బందరు పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి, జోనల్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, తెనాలి శ్రావణ్ కుమార్, గల్లా మాధవి, భాష్యం ప్రవీణ్, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్, బోడె ప్రసాద్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, యువ నాయకుడు మండలి రాజా తదితరులు పాల్గొన్నారు.

# నూతన పాలసీతో అరుదైన వ్యాధిగ్రస్తులకు స్వాంతన

(మొదటి పేజీ తరువాయి)




కర్నూలు, తిరుపతి, విశాఖపట్నంలో ఒక్కొక్కటి చొప్పున రిఫరల్ సెంటర్లను ఏర్పాటుచేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. విజయవాడలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా గుర్తించే విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో బుధవారం 'అరుదైన వ్యాధులు, నిర్ధారణ, చికిత్స అందించేందుకు ఉన్న మార్గాలు-భాగస్వామ్యుల అభిప్రాయాల సేకరణ' సదస్సు జరిగింది. ఈ సదస్సునుద్దేశించి మంత్రి సత్యకుమార్ (వర్చువల్) మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేదా వ్యాధి అరుదైనదనే కారణంతో రోగులకు వైద్యం అందకుండాపోకూడదనేదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడం, ప్రత్యేకంగా వైద్యాన్ని అందించడం, బాధితులకు మానవత్వంతో కూడిన సంరక్షణ అందించడం ముఖ్యమని తెలిపారు. ముఖ్యంగా అరుదైన వ్యాధుల గుర్తింపు విషయంలో సదరు కుటుంబాలకు అవగాహన కల్పించడం తక్షణ కర్తవ్యమన్నారు. అరుదైన వ్యాధిగ్రస్తులకు ఉపయోగించే ఔషధాల ఉత్పత్తి, పంపిణీ, ఇతర అంశాలపై చర్చించేందుకు జులై మొదటి వారంలో ఫార్మా కంపెనీల వారితో సదస్సును ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీఎంఆర్ లో ఉన్న విధంగా ఆరుదైన వ్యాధుల నమోదు తప్పనిసరి గా జరిగేలా 'రిజిస్ట్రే' విధానాన్ని అమల్లోనికి తెస్తామని పేర్కొన్నారు. అరుదైన వ్యాధిగ్రస్తులకు చికిత్సా విధానాన్ని కేరళలో బాగా అమలు చేస్తున్నారని, దీన్ని పరిశీలించి రాష్ట్ర అవసరాలకు తగ్గట్టుగా మార్పులు, చేర్పులతో అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు మంత్రి సూచించారు. అరుదైన వ్యాధిగ్రస్తుల చికిత్స, పరిశోధనలు కొనసాగించంపై తాను ఇంతకుముందే ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఇదే అంశంపై వివిధ రంగాలకు చెందిన భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నానని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ చొరవ చూపడంతో సంప్రదింపుల్లో వేగం మరింత పెరిగిందని పేర్కొన్నారు. పుట్టిన పిల్లల్లో అరుదైన వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు 'యూనివర్శల్ నియోనాటల్ స్క్రీనింగ్' విధానాన్ని ప్రవేశపెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, రాష్ట్ర వ్యాప్తంగా ఉ చిన్న 34 జిల్లా సత్వర చికిత్స కేంద్రాలను ఈ విధానంలో భాగస్వాములు చేస్తామని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో అధిక వ్యయమయ్యే వ్యాధులతో బాధపడే వారిని ఆదుకునేందుకు దాతల నుంచి సహకారాన్ని అందుకునేలా ప్రయత్నా లు ఉండాలన్నారు.

### క్లినికల్ ప్రోటోకాల్ రూపొందించాలి

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ అరుదైన వ్యాధులతో బాధపడే వారిని అభా ఐడీ (డిజిటల్ హెల్త్ రిజిస్ట్రీ)తో అనుసంధానం చేయడం ద్వారా చికిత్స ఎక్కడ జరిగేదీ స్పష్టత వస్తుందన్నారు. అరుదైన వ్యాధులకు సంబంధించి వైద్యులు అందించే చికిత్సపై 'క్లినికల్ ప్రొటోకాల్ 'పటిష్టంగా ఉండాలన్నారు. అలాగే వైద్య సిబ్బందికి శిక్షణ తరగతులు జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2021లో రూపొందించిన పాలసీకి అనుగుణంగా రాష్ట్ర పాలసీ ఉండాలని పేర్కొన్నారు. అరుదైన వ్యాధులకు సంబంధించి చికిత్సా విధానాలు, కేసులను ముందుగానే గుర్తించడం అవసరాలకు తగ్గట్లు వెంటనే స్పందించే విధంగా పాలసీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అరుదైన వ్యాధుల గుర్తింపుపై ప్రజలందరినోనూ అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.

## చెత్త నుంచి తయారు చేసే కాంపోస్ట్‌లో పోషక విలువల పెంపునకు శాస్త్రవేత్తలతో కమిటీ

### పట్టాభిరామ్తో వీసీ సత్యనారాయణ, ఎస్వోపీసీఏ చైర్మన్ దేవదత్ సమావేశం



(అమరావతి,మనం ప్రత్యేక ప్రతినిధి): స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 107 ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలలో తడి చెత్త నుంచి తయారయ్యే కాంపోస్ట్ లో పోషక విలువలు పెంచేందుకు శాస్త్రవేత్తలతో ఒక కమిటీని నియమించడానికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడకట్స్ సర్టిఫికేషన్ అథారిటీలు అంగీకరించాయి. అమరావతిలోని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ కార్యాలయంలో బుధవారం కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పాలడుగు వెంకట సత్యనారాయణ, ఆర్గానిక్ ప్రొడకట్స్ సర్టిఫికేషన్ అథారిటీ (అప్కిఇఅ) చైర్మన్ శావల దేవదత్, డైరెక్టర్ డాక్టర్ యడ్లపల్లి సతీష్ లు సమావేశమయ్యారు. చైర్మన్ పట్టాభిరామ్ ఆహ్వానంపై వారు ఈ సమావేశంలో పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ రాష్ట్ర వ్యాప్తంగా రూ.528.65 కోట్లతో 107 నగరాలు, పట్టణాలలో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆ కేంద్రాలలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి, తడి చెత్త నుంచి కాంపోస్ట్ తయారు చేస్తారు. ఏడాదికి దాదాపు మూడు లక్షల టన్నుల కాంపోస్ట్ తయారవుతుంది. ఆ కాంపోస్ట్ లో రైతులకు ఉపయోగపడేవిధంగా పోషకాలు పెంచి, బయోఫర్టిలైజర్ తయారు చేసి మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు అందజేస్తారు. చెత్త నుంచి తయారయ్యే కాంపోస్ట్ లో పోషక విలువలు పెంచేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఒక కమిటీని నియమించడానికి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ సత్యనారాయణ అంగీకరించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్కు తక్కువ ఖర్చుతో కాంపోస్ట్ లో పోషక విలువలు పెంచే ప్రయత్నం చేస్తామని వైస్ చాన్సలర్ సత్యనారాయణ చెప్పారు. కాంపోస్ట్ ఎన్ రిచ్ మెంట్ ప్రక్రియపై శిక్షణ అందించేందుకు కూడా వ్యవసాయ యూనివర్సిటీ స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ కు సహకారం అందిస్తుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ కు తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని ఆర్గానిక్ ప్రొడకట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ చెప్పారు.

# విద్యా - వైద్య వికసిత్ భారత్- స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో పల్నాడు జిల్లా అగ్రగామిగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్యా, వైద్య రంగాలలో అద్భుత ప్రగతి సాధించడం ద్వారా పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని 20 సూత్రాల పథకం చైర్పర్సన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డా. కృతిక శుక్లా, జాయింట్ కలెక్టర్ సంజన సిన్హా సమక్షంలో వైద్య ఆరోగ్య, విద్యా శాఖలతో పాటు వీబీజీ రామ్ జీ, అమృత్ 1.0, అమృత్ 2.0, జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలుపై ఆయన విస్తృతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ నిజమైన వేతనదారులకు న్యాయం చేస్తూ పనిదినాలను 100 నుండి 125 రోజులకు పెంచడం జరిగిందని వివరించారు. రైతులకు కూలీల కొరత లేకుండా 60 రోజుల మినహాయింపునిస్తూ మొత్తం 185 రోజులు కూలి దొరికేలా కేంద్రం ఈ పథకాన్ని తెచ్చిందని, దీని ద్వారా అత్యధిక నిధులను పల్నాడుకు సాధించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు జలసిరి, మ్యాజిక్ డ్రైన్స్, గ్రామాల డిజిటలైజేషన్, పీఎం గతిశక్తి యోజన పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ రంగంలో పల్నాడును రాష్ట్రానికే ఆదర్శంగా నిలపడమే ధ్యేయమన్నారు. గత 2019-25 మధ్య జిల్లాలో ఏకంగా 17,41,427 మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువులను వాడటం వల్ల భూమి, భూగర్భ జలాలు కలుషితమై వ్యవసాయ ఉత్పత్తులలో విషతుల్యత పెరిగి క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని మొత్తం 4 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో ఈ ఏడాది 80 వేల ఎకరాలను ప్రకృతి వ్యవసాయంలోకి మరల్చాలని అధికారులకు సూచించారు.

సాగర్ కేంద్రంగా పర్యాటక రంగం వృద్ధికి కృషి చేయాలంటూనే, ప్రస్తుతం దేశంలో భూగర్భ జలాలు కలుషితమైన జిల్లాల ర్యాంకులలో పల్నాడు 12వ స్థానంలో ఉన్నందున, జల్ జీవన్ మిషన్ ద్వారా ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్ అనుసంధానం తథ్యమని స్పష్టం చేశారు. అలాగే వరికెపుడిసెల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, కారెంపూడి మండలాలకు పైప్లైన్ల ద్వారా సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 63.14 కోట్ల మంజూరు ఉత్తర్వులు ఇచ్చిందని వెల్లడించారు. వైద్య ఆరోగ్య రంగ ప్రగతిపై లంకా దినకర్ మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 'ఆయుష్మాన్ భారత్ - డా. ఎన్టీఆర్ వైద్య సేవ'లను విస్తృతంగా అమలు చేసి ఆరోగ్య పల్నాడుగా తీర్చిదిద్దాలన్నారు. 'అనీమియా ముక్త్ భారత్' సాధనలో భాగంగా జిల్లాలోని కిషోర బాలికల్లో 3,527 మందికి పరీక్షలు చేయగా 55 శాతం మందికి (1,947 మందికి), అలాగే పరీక్షించిన 11,895 మంది గర్భిణీ స్త్రీలలో 4,089 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించి వారికి పోషకాహారం, మందులు అందిస్తున్నామన్నారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రు. 2 లక్షలు వరకు రుణమాఫీ చేయాలి
- నీటి ప్రాజెక్టు సత్వరం పూర్తి చేయాలి.!!
- 30 తేది న విజయవాడ లో జరిగే రైతుధర్నా జయప్రదం చేయండి!
- ఎపి రైతు సంఘం



తిరుపతి జూన్24 మనం న్యూస్: రైతులు పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ తో ఈనెల 30 తేదీన రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం పిలుపిచ్చింది.. ఈ మేరకు రాయచోటి నియోజకవర్గం రైతు సంఘం సమావేశం వంగిమల్ల రంగా రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ లో జరిగిన సదస్సు లో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. రామానాయుడు,, రైతు సంఘ నేత డా. టి. జనార్దన్,, ప్రధాన వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు,, కౌలు రైతులు రుణ భారం నుండి విముక్తి కావడానికి తెలంగాణా తరహాలో రు..2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ఉద్యాన హబ్ అంటూ ఊదరగొట్టడం తప్ప, నేడు, మామిడి,, బొప్పాయి,, అరటి,, ఉల్లి, నిమ్మ రైతులు గిట్టుబాటు ధరకు రోడ్డెక్కే స్థితి కల్పించబడిందని అన్నారు. వృద్ధాప్యం లో అన్నదాత కు ఆదుకొనేందుకు 50 సంవత్సరాలు పైబడిన రైతులకు రు. 10 వేలు పెన్షన్ చెల్లించాలని కోరారు.. పంటల బీమా పథకం అమలు చేసి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా లో కూడా మామిడి రైతులకు రు 4 సబ్సిడీ అందజేయాలని ఫ్యాక్టరీ యజమాన్యం, అక్రమాలు కట్టడి చేసి ప్రభుత్వ కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.. సిపిఐ, జిల్లా కార్యదర్శి మహేష్,, యంఆర్ పియస్ నేత రామాంజనేయులు మాట్లాడు తూ రైతులు జూన్ 30 న రైతు సంఘం చేపట్టే ఛలో విజయవాడ కు పెద్దసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.. ఈ సమావేశంలో, సిపిఐ,, ఏరియా కార్యదర్శి, శ్రీనివాస్ , గిరిజన రాష్ట్ర నేత విశ్వనాథ్ నాయక్, లు ప్రసంగించారు. కార్యక్రమం లో రైతుసంఘం ఏరియా అధ్యక్షులు హరినాథ్ నాయుడు,,విష్ణువర్ధన్ రెడ్డి, రమణారెడ్డి,, రమణ,,షబ్బీర్ బాషా, బ్రహ్మానంద రెడ్డి.. తదితరులు పాల్గొన్నారు.

# తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం

- రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ విభజనతో తిరుపతి ప్రజలకు మెరుగైన సేవలు
- భూ రీ-సర్వే 2.0 ద్వారా పారదర్శక భూ పరిపాలనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- తాజ్ సర్కిల్ నుండి శ్రీనివాసపురం వాటర్ ట్యాంక్ వరకు శాశ్వత పైప్లైన్ నిర్మాణ పనులకు భూమిపూజ :మంత్రి అనగాని సత్యప్రసాద్



తిరుపతిరూరల్, జూన్ 24మనం న్యూస్:తిరుపతి ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్న రిజిస్ట్రేషన్ సేవల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని విభజించి తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరింత సులభంగా, వేగవంతంగా సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.బుధవారంతిరుచానూరులో ఏర్పాటు చేసిన నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కమిషనర్,ఇన్స్పెక్టర్ జనరల్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దుగ్గుమల్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి అనుగుణంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు, రిజిస్ట్రేషన్ లావాదేవీలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో కొత్త కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తిరుచానూరు ప్రాంతంలో ఉన్న పాత సచివాలయ భవనాన్ని ఆధునీకరించి తాత్కాలికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా మార్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత భవనాన్ని నిర్మించి అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కూడా రానున్న రెండు నుంచి మూడు సంవత్సరాల్లో శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే 2.0 కార్యక్రమంపై మంత్రి ప్రత్యేకంగా స్పందిస్తూ, గతంలో సర్వే ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, ప్రస్తుతం ప్రతి పట్టాదారుకు పూర్తి సమాచారం అందిస్తూ అత్యంత పారదర్శకంగా రీ-సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. వాట్సాప్ గ్రూపులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ, ఈ-కేవైసీ ధృవీకరణ వంటి విధానాల ద్వారా భూ యజమానుల సమ్మతి, ధృవీకరణ అనంతరమే సర్వే పూర్తయినట్లు నిర్ధారిస్తున్నామని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన సుమారు 7.5 లక్షల ఫిర్యాదులు, దరఖాస్తులను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భూమి వివాదాలు, 22-ఏ భూములకు సంబంధించిన అంశాలు, కోర్టుల్లో పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారంలో చట్టపరమైన విధానాలను అనుసరిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తాజ్ సర్కిల్ నుండి శ్రీనివాసపురం వాటర్ ట్యాంక్ వరకు ఏర్పాటు చేయనున్న శాశ్వత పైప్లైన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ పైప్లైన్ పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి పంపిణీ వ్యవస్థ బలోపేతం కానుందని తెలిపారు. అనంతరం శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ పరిధిలో మార్కెట్ యార్డ్ నుండి తాజ్ సర్కిల్ వరకు నిర్మించిన సీసీ రోడ్డు మరియు మురుగు కాలువలను మంత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ పనులు ప్రాంతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా,పారిశుధ్య సౌకర్యాలను అందించనున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, జిల్లా రిజిస్ట్రార్ రామ్కుమార్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్పర్సన్ సుగుణమ్మ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ప్రజాప్రతినిధులు, అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నగొట్టిగల్లులో రూ.3 కోట్లతో నిర్మించిన విద్యాసంస్థ ప్రారంభం



చిన్నగొట్టిగల్లు జూన్24మనంన్యూస్: చిన్నగొట్టిగల్లు మండలంలో విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు మండలంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన వి.సిద్ధ రామి రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాద్ రావు, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి లతో కలసి జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్ ,స్టాంప్స్ శాఖ మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి మాట్లాడుతూ....

చిన్నగొట్టిగల్లు మండలంలో విద్యా, సామాజిక అభివృద్ధి కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్న దాతలు, ప్రజాప్రతినిధులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందించారు. తాము పుట్టి పెరిగిన ప్రాంతాల అభివృద్ధికి ముందుకు వస్తున్న దాతల సేవా భావం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

# రూ.15 లక్షల నగదు దోపిడీ కేసును ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు


- 8 మంది నిందితుల అరెస్ట్ - రూ. 3,00,000/- నగదు, నాలుగు వాహనాల స్వాధీనం.
- కర్ణాటక, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన నిందితుల ముఠాగా గుర్తింపు.



తిరుపతి జూన్24 మనం న్యూస్: అంతర్ రాష్ట్ర 8 మంది దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుంచి మూడు లక్షల నగదు నాలుగుకారులను స్వాధీనం చేసుకున్నట్లు ఏ ఎస్ పి శ్రీనివాసులు తెలిపారు.తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పరిధిలోని శ్రీకాళహస్తి-తిరుపతి జాతీయ రహదారి లో అంజిమేడు బస్ స్టాప్ సమీపంలోని దీప్ పంజాబీ దాబా వద్ద జూన్ 2026న జరిగిన రూ.15 లక్షల నగదు దోపిడీ కేసును తిరుపతి జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి నగదు నేరానికి వినియోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ (పరిపాలన) ఆర్ల శ్రీనివాసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టు, స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాల వివరాలను మీడియాకు వివరించారు.ఫిర్యాదుదారు రవీంద్రరెడ్డి అలియాస్ వేణు తన వద్ద ఉన్న రూ.15 లక్షల నగదుతో ప్రయాణిస్తుండగా, నిందితులు ముందస్తు పథకం ప్రకారం అతనిని అడ్డగించి కత్తితో బెదిరించి నగదును అపహరించారు. అనంతరం ఫిర్యాదుదారుతో పాటు ఉన్న బాబురెడ్డిని ఇన్నోవా వాహనం నుండి బలవంతంగా దింపివేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఏర్పేడు పోలీసులు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. అదనపు ఎస్పీ (పరిపాలన) ఆర్ల శ్రీనివాసులు పర్యవేక్షణలో, రేణిగుంట ఎస్డీపీవో వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటైంది. దర్యాప్తులో భాగంగా మంగళవారం సాయంత్రం ఏర్పేడు మండలం నీలాద్రి అపార్ట్మెంట్స్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో కేసులోని ఎ-2 నుండి ఎ-9 వరకు ఉన్న ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో వారు నేరానికి పాల్పడినట్లు అంగీకరించారు. అరెస్టు చేసిన నిందితుల వద్ద నుండి దోచుకున్న నగదులో భాగంగా సుమారు రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నేరానికి వినియోగించిన ఒక ఇన్నోవా వాహనం, రెండు స్విఫ్ట్ డిజైర్ కార్లు, ఒక స్విఫ్ట్ కారు సహా మొత్తం నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రధాన నిందితురాలు ఎ-1 లక్ష్మీకాంతమ్మ ప్రస్తుతం పరారీలో ఉండగా, ఆమెను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. దర్యాప్తులో నిందితులు కర్ణాటక రాష్ట్రంతో పాటు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. వీరిలో కొందరిపై గతంలో మోసం, దోపిడీ, దొంగతనం తదితర కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# అప్పలాయగుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి దివ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- జూన్ 25న ధ్వజారోహణంతో వైభవోత్సవాల ప్రారంభం
- గోవింద నామస్మరణతో మారుమోగనున్న అప్పలాయగుంట



తిరుపతి జూన్ 24.మనం న్యూస్: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మేదినిపూజ నిర్వహించి, అనంతరం సేనాధిపతి ఉత్సవాన్ని చేపట్టారు. సంప్రదాయం ప్రకారం శ్రీ విష్వక్సేనులవారు నాలుగు మాడవీధుల్లో విహరించి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి, అన్ని కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేలా అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం. అనంతరం యాగశాలలో అంకురార్పణ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు మంగళారంభం పలికారు.జూన్ 25న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాల ప్రారంభంజూన్ 25 గురువారం ఉదయం 8.30 గంటల నుండి 9.00 గంటల మధ్య కర్కాటక లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నారు. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. దివ్య వాహనసేవలతో భక్తులకు ఆధ్యాత్మికానందంబ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామివారు వివిధ దివ్య వాహనాలపై విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు.జూన్ 25 - ధ్వజారోహణం, పెద్దశేష వాహనం,జూన్ 26 - చిన్నశేష వాహనం, హంస వాహనం,జూన్ 27 - సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం,జూన్ 28 - కల్పవృక్ష వాహనం, కల్యాణోత్సవం, సర్వభూపాల వాహనం,జూన్ 29 - మోహినీ అవతారం, గరుడ వాహనం,జూన్ 30 - హనుమంత వాహనం, గజ వాహనం,జూలై 1 - సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం,జూలై 2 - రథోత్సవం, అశ్వవాహనం,జూలై 3 - చక్రస్నానం, ధ్వజావరోహణం బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీత కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించనున్నారు. ఈ కార్యక్రమంలో కంకణ భట్టర్ సూర్యకుమార్ ఆచార్యులు, టిటిడి డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, వీజీవో వి.గిరిధర్, అదనపు హెల్త్ ఆఫీసర్ డా. సునీల్, ఏవీఎస్వో రాధాకృష్ణ, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

# శక్తి యాప్ డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన



చిత్తూరు జూన్24 మనం న్యూస్: చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి,ఆదేశాల మేరకు, చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ సుబ్బా రెడ్డి సిబ్బంది ఈరోజు చిత్తూరు పట్టణంలోని పి.సి.ఆర్ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళలపై జరిగే నేరాలు, మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ప్రాముఖ్యత, ర్యాగింగ్, ఈవ్టీజింగ్, మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు మరియు వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షల గురించి వివరించారు.మహిళలు బాలికలు ఎలాంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొన్నా శక్తి యాప్ ద్వారా తక్షణమే పోలీసులకు సమాచారం అందించవచ్చని, యాప్లోని ఖిఖి బటన్ను ఉపయోగించడం ద్వారా సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం చేరి వెంటనేసహాయంఅందుతుందని వివరించారు. ప్రతి విద్యార్థిని శక్తి యాప్ను తమ మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు.అలాగే విద్యాసంస్థల్లో ర్యాగింగ్ మరియు ఈవ్టీజింగ్ వంటి సంఘటనలు చట్టరీత్యా నేరాలని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, డ్రగ్స్కు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, అత్యవసర సహాయం కోసం 112 ఎమర్జెన్సీ నంబర్ ఇతర హెల్ప్లైన్ సేవలను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా స్టేషన్ ఏ.ఎస్.ఐ. శ్రీ వెంకటేష్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నంది సర్కిల్ సమీపంలో ఎరువుల దుకాణంపై అధికారుల దాడి

- అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు:ఏడీఏ రమేష్ రెడ్డి హెచ్చరిక
- దుకాణదారుడికి షోకాజ్ నోటీసు.. 10 రోజుల పాటు లైసెన్స్ సస్పెన్షన్



శ్రీకాళహస్తి, జూన్ 24,మనం న్యూస్: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, రైతులకు నిర్ణీత ధరల కంటే ఎక్కువ రేట్లకు ఎరువుల బస్తాలను విక్రయిస్తున్న పట్టణంలోని ఒక ప్రముఖ దుకాణంపై వ్యవసాయ శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నంది సర్కిల్ సమీపంలో గల ఒక ఫెర్టిలైజర్ షాపులో ఎం.ఆర్.పి ధరల కంటే అదనపు ధరలకు ఎరువులు అమ్ముతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి.ఈ నేపథ్యంలో అగ్రికల్చర్ ఏడీఏ రమేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేంద్ర రెడ్డి తమ సిబ్బందితో కలిసి సదరు దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వ్యాపారి అక్రమంగా, అధిక ధరలకు ఎరువుల బస్తాలను విక్రయిస్తున్నట్లు ఆధారాలతో సహా పట్టుబడింది. కఠిన చర్యలు - లైసెన్స్ సస్పెన్షన్: నిబంధనల ఉల్లంఘనపై తీవ్రంగా స్పందించిన ఏడీఏ రమేష్ రెడ్డి, ఎంఏఓ సురేంద్ర రెడ్డిలు సదరు దుకాణదారుడికి తక్షణమే షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి అక్రమాలకు పాల్పడినందుకు గాను సదరు దుకాణం లైసెన్స్ను 10 రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రతి దుకాణంలోనూ స్టాక్ వివరాలు, ధరల పట్టికను రైతులకు కనిపించేలా బోర్డుపై ప్రదర్శించాలి. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు పెడతాం.'అధికారుల మెరుపు తనిఖీలు మరియు కఠిన చర్యలతో పట్టణంలోని అలాగే నియోజకవర్గంలోని మిగిలిన ఎరువుల వ్యాపారుల్లో ఒక్కసారిగా వణుకు మొదలైంది.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అడుగులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు



కళ్యాణదుర్గం టౌన్ జూన్ 24 మనం న్యూస్ ప్రజాదర్బార్ లో ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే సురేంద్ర బాబు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ చూసినా సమస్యలే ఉన్నాయని వాటిని అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు ప్రజావేదిక నందు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గ ప్రజాదర్బార్ పిర్యాదుల స్వీకార కార్యక్రమం నిర్వహించి పిర్యాదులు స్వీకరించారు.. సమస్యలతో వచ్చే ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం చేసేందుకు సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి వారి సమస్య పరిష్కారం చేసేలా ఎమ్మెల్యే అమిలినేని చర్యలు చేపడుతున్నారు. కేవలం అధికారులకు చెప్పి వదిలేయకుండా తిరిగి అధికారుల నుంచి సమస్య పరిష్కారం అయిందా లేదా అని తిరిగి తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు..చాలా వరకు వైసీపీ ప్రభుత్వంలో అడ్డదిడ్డంగా చేసిన కబ్జాలు, రస్తా సమస్యలు, భూమి సర్వే సమస్యలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ ల కోసమే అధికారుల చుట్టు తిరుగుతున్నారని నిత్యం సమస్యలతో వచ్చే వారి నుంచి వినతులు స్వీకరిస్తూ సంబంధిత అధికారులకు వాటిని పంపి సమస్య పరిష్కారం కోసం పనిచేస్తున్నారు

# విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్, జూన్ 24(మనంన్యూస్): వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తెట్టేకుంట తండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం మరియు పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన, పోషకాహార కార్యక్రమాలు, మౌలిక వసతులను పరిశీలించారు. పిల్లల హాజరు, విద్యా ప్రమాణాలు, అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రాలు మరియు పాఠశాలల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎంపీపీఎస్ తెట్టేకుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిధిలావస్థలో ఉన్నందున రానున్న వర్ష కాలం దృష్ట్యా సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పరిసర ప్రజలకు ఏదైనా త్రాగునీటి సరఫరా సమస్య లు ఉన్నట్లు అయితే పరిష్కరించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారి నిర్మలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఆర్డీవో సుమ,రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పిపోయినప్పుడు

ఎక్కడో దారి తప్పిపోయానని
అనిపించిన క్షణం
నడకను ఆపేయాల్సిందే
నువ్వు చేరుకున్న చోటు నీకు తెలియకపోవచ్చు

కానీ ఆ నేలకు నీ అడుగుల శబ్దం తెలుసు
చెట్టు నీడలో నిలబడిచూడు ఆ చెట్టుకు
నీ పేరు తెలియకపోయినా
అది నీ ఊపిరి వేడిని గుర్తిస్తుంది

గాలి మాట్లాడుతోంది విను
ఆకులు కదులుతున్నాయి అది కేవలం కదలడం
కాదు
నీ భయాన్ని మెల్లగా డస్టర్లా తుడిచేస్తున్నాయి
అడవి ఎప్పుడూ దారి తప్పదు దారి తప్పేది
మనిషే

ఎందుకంటే ప్రతి చెట్టును ఒకే చెట్టుగా
ప్రతి పక్షిని ఒకే పాటగా
ప్రతి రోజునూ ఒకే ఉదయంగా
చూడడం నేర్చుకున్నాం

నిజానికి ఏ రెండు కొమ్మలూ ఒకేలా ఉండవు
ఏ రెండు ఆకులూ ఒకేలా పచ్చదనాన్ని ధరించవు
అయితే మనమే ఎందుకు
ప్రపంచాన్ని ఒకే రంగుతో పూస్తుంటాం?

ఒక్కసారి ఆగి చూడు నీ చుట్టూ ఉన్న నిశ్శబ్దం
నీకు పరాయిది కాదు
అది నీకంటే ముందే ఇక్కడ ఉంది
నీ తర్వాత కూడా
అది ఇక్కడ ఉంటుంది

నువ్వు వెతుకుతున్న దారి
బహుశా నీ వెలుపల ఉండకపోవచ్చు
కొన్నిసార్లు మనిషి తనను
తాను వెతుక్కోవడానికి తప్పిపోవాల్సిందే

నదులు కూడా సముద్రాన్ని చేరే ముందు
ఎన్నో ఎన్నెన్నో మలుపులు తిరుగుతాయి
మేఘాలు కూడా చినుకులుగా మారే ముందు
ఎన్నో దూరాలను ఆకాశాలను దాటేవుంటాయి

అందుకే భయం వద్దు
నీ కాళ్ల కింద ఉన్న నేల నిన్ను మోస్తోంది
నీ తలపై ఉన్న ఆకాశం నిన్ను మరచిపోదు
నిశ్చలంగా ఉండు

ఈ విశ్వానికి నువ్వు కనిపిస్తూనే వున్నావు
నీ గురించి నీ కన్నా ఎక్కువగా తెలిసిన
ఒక వెలుగు ఉంది అది వస్తుంది
నిన్ను పేరు పెట్టి పిలుస్తుంది

అప్పుడు నీకు తప్పకుండా అనిపిస్తుంది
నువ్వు ఎప్పుడూ తప్పిపోలేదని
నీ ఆత్మ ..నిన్ను మళ్లీ కనుగొనడానికి
కొంత సమయం మాత్రమే తీసుకుంది

**- వారాల ఆనంద్**
9440501281

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

– ఎడిటర్

# నాయకులకు అధికారమే పరమావధి!?



భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓట్లతో ఎన్నుకోబడిన ప్రతినిధుల ద్వారా ప్రభుత్వాలు ఏర్పడతాయి. రాజ్యాంగం నిర్దేశించిన విలువలు, నియమాలకులోబడి పాలన సాగాలి. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు, అసమ్మతి స్వరాలు సహజం. పార్టీ విధానాలతో విభేదిస్తూ నాయకులు బయటకు రావడం కూడా ప్రజాస్వామ్య హక్కే. అయితే అది సిద్ధాంత పరమైన కారణాలతో కాకుండా పదవులు, అధికారాలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం జరిగితే ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం కలుగుతుంది.

నేడు దేశ రాజకీయాల్లో సిద్ధాంతాల కంటే అధికారం ప్రధాన లక్ష్యంగా మారిన పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఒక పార్టీ గుర్తుపై గెలిచి, తర్వాత అధికార ప్రయోజనాల కోసం మరో పార్టీలో చేరడం ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించడమే. ప్రజలు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ విధానాలను కూడా నమ్మి ఓటు వేస్తారు. అలాంటి విశ్వాసాన్ని ద్రోహం చేయడం ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధం. భారత రాజకీయ చరిత్రలో పార్టీ ఫిరాయింపులు కొత్త విషయం కాదు. స్వాతంత్ర్యం అనంతరం అనేక సందర్భాల్లో ప్రజాప్రతినిధులు తమ రాజకీయ విధేయతలను మార్చుకున్నారు. రాజకీయ విశ్లేషకుల లెక్కల ప్రకారం 1967 తర్వాత దేశవ్యాప్తంగా వేలాది మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీలు మారారు. ఇటీవల కూడా అనేక రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలు ఫిరాయింపుల కారణంగా కుప్పకూలిన సందర్భాలు చూశాం.

ఫిరాయింపులను అరికట్టేందుకు 1985లో రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అమల్లోకి వచ్చింది. అయితే ఈ చట్టం వ్యక్తిగత ఫిరాయింపులను కొంతవరకు అడ్డుకున్నప్పటికీ, సమూహంగా జరిగే రాజకీయ వలసలను పూర్తిగా నియంత్రించలేకపోయింది. ఫలితంగా అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో రాజకీయ అస్థిరత ఏర్పడింది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ మారిన ప్రజాప్రతినిధులపై త్వరితగతిన నిర్ణయం తీసుకునే స్వతంత్ర వ్యవస్థ అవసరమని అనేక ప్రజాస్వామ్యవాదులు సూచిస్తున్నారు. ప్రజల తీర్పును వక్రీకరించే రాజకీయ వలసలపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజలలో రాజకీయాల పట్ల నమ్మకం క్రమంగా తగ్గిపోతుంది. ప్రతి రాజకీయ పార్టీ ఒక ఆశయం, ఒక సిద్ధాంతం, ఒక సామాజిక అవసరం నుంచి పుట్టుకొస్తుంది. ప్రారంభ దశలో ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వం కనిపిస్తుంది. కానీ కాలక్రమేణా అధికారానికి చేరువైన కొద్దీ అనేక పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది.

నిజం చెప్పే వారిని పక్కనపెట్టి, నాయకుడికి నచ్చిన మాటలు చెప్పేవారికి ప్రాధాన్యం పెరుగుతుంది. విమర్శలను ద్రోహంగా, ప్రశ్నలను తిరుగుబాటుగా చూడటం ప్రారంభమవుతుంది. క్షేత్రస్థాయి వాస్తవాలు నాయకత్వానికి చేరవు. ఫలితంగా నాయకులు భ్రమల్లో జీవిస్తారు. భారీ సభలు, ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ కార్యకర్తల్లో నిరాశ పెరుగుతుంది.

వ్యక్తిపూజ పెరగడం, అవినీతి సాధారణమవడం, కష్టపడిన వారికి అవకాశాలు లేకపోవడం, మేధావులు పార్టీని వీడిపోవడం వంటి లక్షణాలు సంస్థాగత క్షీణతకు సంకేతాలు. బయటకు బలంగా కనిపించే పార్టీ లోపల నుంచి క్రమంగా బలహీనపడుతుంది. చరిత్రలో ఎన్నో శక్తివంతమైన రాజకీయ సంస్థలు ఈ కారణాల వల్లే పతనమయ్యాయి.



ఏ సంస్థైనా విమర్శలను అంగీకరించకపోతే, ఆత్మపరిశీలన చేయకపోతే, రెండోస్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించకపోతే దీర్ఘకాలం నిలబడలేక పోతుంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యత ముందుగా రాజకీయ పార్టీలదే.

నాయకత్వం అనేది కేవలం అధికారాన్ని అనుభవించడం కాదు. ప్రజల బాధలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపించడం. నిజమైన నాయకుడు చప్పట్లతో ఎదగడు. విమర్శల ద్వారా పరిపక్వత సాధిస్తాడు. ప్రజల సమస్యలను వినడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం, కొత్త ఆలోచనలకు స్వాగతం పలకడం నాయకత్వానికి మూల సూత్రాలు.

ప్రజాస్వామ్యానికి ప్రాణం కేవలం ఎన్నికలు కావు. ఎన్నికల తర్వాత కూడా ప్రజల గొంతుక వినిపించే అవకాశం ఉండాలి. అసమ్మతిని సహించే సంస్కృతి, పారదర్శకత, జవాబుదారీ తనం ప్రజాస్వామ్యానికి జీవం పోస్తాయి. ప్రజల తరపున నిలబడే నాయకత్వమే చరిత్రలో నిలిచిపోతుంది.

డబ్బు, అధికారం, ప్రచారం ఏ పార్టీని శాశ్వతంగా నిలబెట్టలేవు. ప్రజల నమ్మకం, కార్యకర్తల అంకితభావం, సిద్ధాంతాల పట్ల నిబద్ధత మాత్రమే రాజకీయ సంస్థలకు నిజమైన బలాలు. ప్రజలతో అనుబంధం కోల్పోయిన పార్టీలు ఎంత బలంగా కనిపించినా ఒక దశలో బలహీనపడక తప్పదు.

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు, నాయకులు ప్రజలకు సేవ చేయడానికి ఉన్న సాధనాలు మాత్రమే; ప్రజలపై ఆధిపత్యం చెలాయించడానికి కావు.

అధికారం శాశ్వతం కాదు. కానీ ప్రజల తీర్పు శాశ్వత పాఠం. సిద్ధాంతాలను తాకట్టు పెట్టి అధికారాన్ని వెంబడించే రాజకీయాలు తాత్కాలిక విజయాలను ఇవ్వొచ్చు; కానీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతాయి. విమర్శలను అంగీకరించే సంస్కృతి, అంతర్గత ప్రజాస్వామ్యం, ప్రజా బాధ్యత, నైతిక రాజకీయాలు పెరిగినప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

పార్టీలకు అధికారమే పరమావధి కాకుండా ప్రజాసేవే పరమ ధ్యేయంగా మారిన రోజే ప్రజాస్వామ్యం తన అసలు అర్థాన్ని సార్థకం చేసుకుంటుంది.

**- మేకిరి దామోదర్**
9573666650

# రిజర్వేషన్‌లపై దాడి?... అస్తిత్వానికి సవాళ్లు



భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లను కేవలం సంక్షేమ పథకంగా ఇవ్వలేదు. శతాబ్దాలుగా కొనసాగిన సామాజిక అణచివేతకు చారిత్రక పరిహారంగా, సమాన అవకాశాల హక్కుగా వాటిని కల్పించింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దృష్టిలో రిజర్వేషన్ అనేది దానం కాదు; అది న్యాయం. అది కరుణ కాదు. అది రాజ్యాంగ హామీ. ఇలాంటి పరిస్థితిలో గత పదిహేనేళ్లలో జారీ చేసిన అన్ని కుల ధృవీకరణ పత్రాలను మళ్లీ పరిశీలిస్తామని ప్రకటించడం కేవలం పరిపాలనా చర్యగా చూడలేం. ఇది లక్షలాది దళిత, ఆదివాసీ, ఓబీసీ కుటుంబాల జీవితాలను ప్రభావితం చేసే కీలక రాజకీయ నిర్ణయం. నకిలీ కుల ధృవీకరణ పత్రాలను గుర్తించడం ప్రభుత్వ బాధ్యతే. కానీ నకిలీ పత్రాలను అరికట్టే పేరుతో మొత్తం సమాజాన్నే అనుమానితులుగా చూడడం ప్రజాస్వామ్య పద్ధతి కాదు. ఒక విద్యార్థి పదేళ్ల క్రితం పొందిన కుల ధృవీకరణ పత్రంతో చదువు పూర్తి చేశాడు. ఒక ఉద్యోగి ఆ ధృవీకరణ ఆధారంగా ఉద్యోగం పొందాడు. ఇప్పుడు వారందరినీ మళ్లీ తమ అస్తిత్వాన్ని నిరూపించుకోమని అడగడం అనేది కేవలం పరిపాలనా ప్రక్రియ కాదు. అది సామాజిక అవమానానికి దారితీసే ప్రమాదకర ధోరణి.



ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పౌరసత్వం, ఓటరు జాబితాలు, జనాభా లెక్కలు, గుర్తింపు పత్రాల చుట్టూ వివిధ వివాదాలు చెలరేగాయి. ఇప్పుడు అదే తరహాలో కుల ధృవీకరణ పత్రాల అంశం ముందుకు రావడం యాదృచ్ఛికం కాదు. మార్క్సిస్టు దృక్పథంలో చూస్తే, ప్రజలను వారి వర్గ ప్రయోజనాల చుట్టూ ఐక్యం కాకుండా చేయడానికి పాలక వర్గాలు తరచుగా గుర్తింపు రాజకీయాలను ఉపయోగిస్తాయి. ఒకవైపు నిరుద్యోగం, విద్యా సంక్షోభం, ధరల పెరుగుదల వంటి సమస్యలు తీవ్రమవుతుండగా, మరోవైపు ప్రజల అస్తిత్వాన్నే ప్రశ్నించే కొత్త వివాదాలు సృష్టించబడుతున్నాయి.

దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాల రాజ్యాంగబద్ధ హక్కులను బలహీనపరచే ఏ చర్య అయినా చివరికి భారత రాజ్యాంగ స్ఫూర్తిపైనే దాడి అవుతుంది. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య ప్రతినిధిత్వం అనే మూడు స్తంభాల మీదే భారత రాజ్యాంగం నిలబడి ఉంది. రిజర్వేషన్లు ఈ మూడు లక్ష్యాల సాధనకు ప్రధాన సాధనం.

న్యాయపోరాటం నుంచి ప్రజా ఉద్యమం వరకు సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం కేవలం ఒక న్యాయపరమైన చర్య మాత్రమే కాదు. ఇది సామాజిక న్యాయాన్ని కాపాడే విస్తృత ప్రజాస్వామ్య పోరాటంలో భాగంగా చూడాలి. చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే-హక్కులు ఎప్పుడూ పై నుంచి బహుమతిగా రావు. అవి ప్రజల పోరాటాల ద్వారానే సాధించబడతాయి, పరిరక్షించబడతాయి.

ఈ నేపథ్యంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. గత పదిహేనేళ్లలో జారీ చేసిన దళిత, ఆదివాసీ, ఓబీసీ కుల ధృవీకరణ పత్రాల పునః ధృవీకరణ (రీ-వెరిఫికేషన్) పేరుతో జరుగుతున్న అసాంవిధానిక చర్యలను సవాలు చేస్తూ కలకత్తా హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (WPA(P)/304/2026) దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి అభిజిత్ మజుందార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మలయ్ తివారీ పిటిషనర్లుగా వ్యవహరిస్తున్నారు. దళిత, ఆదివాసీ, బహుజన సమాజాల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడమే ఈ వ్యాజ్యం లక్ష్యమని పార్టీ స్పష్టం చేసింది. నకిలీ ధృవీకరణ పత్రాలను గుర్తించడం పేరుతో నిజమైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల ప్రజలను అనుమానితులుగా ముద్ర వేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది సామాజిక న్యాయ సూత్రాలపై దాడి అని పిటిషన్లో పేర్కొంది. ముఖ్యంగా ఓటరు జాబితాలో పేరు ఉండటాన్ని కుల ధృవీకరణ పత్రాల చెల్లుబాటుతో అనుసంధానించడం చట్టవిరుద్ధమని వ్యాజ్యం వాదిస్తోంది.ఈ న్యాయ పోరాటం కేవలం కోర్టు గదులకే పరిమితం కాదని, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని అన్ని ప్రజాస్వామ్య శక్తులు, దళిత-ఆదివాసీ-బహుజన సంఘాలు, విద్యార్థి-యువజన ఉద్యమాలు కలిసి విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పిలుపునిస్తోంది.


దళితులు, ఆదివాసీలు, ఓబీసీల అస్తిత్వాన్ని ప్రశ్నించే ప్రతి చర్యను ప్రజాస్వామ్య శక్తులు అప్రమత్తంగా గమనించాలి. రిజర్వేషన్ అనేది కేవలం ఉద్యోగం లేదా సీటు గురించి కాదు; అది గౌరవం, ప్రతినిధిత్వం, సమానత్వం గురించి. అంబేద్కర్ కలగన్న సామాజిక ప్రజాస్వామ్యం, రాజ్యాంగం హామీ ఇచ్చిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలను కాపాడుకోవడం నేటి చారిత్రక బాధ్యత. రిజర్వేషన్ హక్కులను కాపాడటం అంటే కేవలం ఒక వర్గాన్ని కాపాడటం కాదు; భారత ప్రజాస్వామ్య ఆత్మను కాపాడటం.

**- మామిండ్ల రమేష్ రాజా**
7893230218

# వర్షపు నీటిని ఒడిసిపడితేనే భద్రత



ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరాలలో నీరు అత్యంత ముఖ్యమైనది. నీరు లేకుండా జీవం లేదు. మానవులు, జంతువులు, పక్షులు, మొక్కలు ఇలా సమస్త జీవకోటి మనుగడకు నీరే ఆధారం. అయితే నేడు ప్రపంచవ్యాప్తంగా తాగునీటి కొరత, భూగర్భ జలాల తగ్గుదల, వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి సమస్యలు మానవాళిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం చేయగలిగే అత్యంత సులభమైన మరియు సమర్థవంతమైన పని వర్షపు నీటిని ఒడిసిపట్టడం. వర్షాకాలం ప్రకృతి ప్రసాదించే అమూల్యమైన సమయం. ఈ వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోగలిగితే భవిష్యత్తులో తాగునీటి సమస్యలను అధిగమించవచ్చు. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వర్షపు నీరు ఎక్కువగా కాలువల ద్వారా వృథాగా నదులు, సముద్రాలలో కలిసిపోతోంది. ప్రతి సంవత్సరం వర్షపాతం తగ్గడం, అసమానంగా కురవడం, అటవీ నిర్మూలన, అధికంగా బోర్లు వేయడం వంటి కారణాల వల్ల భూగర్భ జలాల మట్టాలు క్రమంగా పడిపోతున్నాయి. ఫలితంగా వేసవికాలంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు సాగునీటి కొరతతో పంటలను కోల్పోతున్నారు. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి బావులు, బోర్లు ఎండిపోకుండా ఉంటాయి. వర్షాకాలానికి ముందు చెరువులను శుభ్రపరచి, పూడిక తొలగించి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచితే భారీగా వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చు. అలాగే పొలాల్లో చిన్న చిన్న గుంతలు, కందకాలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు పొలంలోనే నిలిచి భూమిలోకి ఇంకే అవకాశం ఉంటుంది. ఇది భూసారాన్ని కూడా కాపాడుతుంది. వర్షాకాలం మొక్కలు నాటడానికి అత్యంత అనుకూలమైన సమయం. ఈ కాలంలో నాటిన మొక్కలు సులభంగా భూమిలో స్థిరపడతాయి. మొక్కలు పెరిగి చెట్లుగా మారినప్పుడు వాతావరణంలో తేమను పెంచి వర్షాలను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకుంటే కొద్ది సంవత్సరాల్లోనే పచ్చదనం పెరిగి పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుంది. రైతులు పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునే పద్ధతులను అనుసరించాలి. కాంటూర్ బండ్లు, ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యామ్‌లు, నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. దీని వల్ల భూగర్భ జలాలు పెరిగి పంటలకు అవసరమైన నీరు అందుతుంది. వ్యవసాయ ఉత్పత్తి కూడా మెరుగుపడుతుంది. అలానే అడవులలో విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం వల్ల అనేక జంతుజీవరాసులు తమ సహజ ఆవాసాలను కోల్పోతున్నాయి. చెట్లు కేవలం నీడను, ఆహారాన్ని మాత్రమే అందించవు అడవులలోని నీటి వనరులను సంరక్షించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. చెట్లు లేకపోవడంతో వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు క్షీణించడం, చిన్న చిన్న వాగులు, గుంటలు ఎండిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జంతువులు కొంతకాలం ఆహారం లేకపోయినా జీవించగలవు, కానీ నీరు లేకుండా ఎక్కువకాలం మనుగడ సాగించలేవు. అడవుల్లో నీటి కొరత ఏర్పడినప్పుడు జంతువులు దాహం తీర్చుకోవడానికి గ్రామాలు, పట్టణాల వైపు రావాల్సి వస్తుంది. అంతేకాకుండా, నీరు అందక అనేక పక్షులు, జంతువులు, ఇతర జీవరాసులు మరణాల బారిన పడే అవకాశం కూడా ఉంది. అందువల్ల అడవుల సంరక్షణ, చెట్ల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ వంటి చర్యలు అత్యంత అవసరం. ప్రతి చెట్టు ఒక చిన్న జలాశయం వంటిది. చెట్లు పెరిగితే వర్షాలు పెరుగుతాయి, నీటి వనరులు నిలిచి ఉంటాయి, జీవరాశులకు అవసరమైన ఆహారం, నీరు, ఆశ్రయం లభిస్తాయి. ప్రకృతిని కాపాడటం అంటే కేవలం చెట్లను కాపాడటం మాత్రమే కాదు, సమస్త జీవకోటిని సంరక్షించడం కూడా. ప్రతి పౌరుడి బాధ్యత కూడా. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, గ్రామపంచాయతీలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టు అమూల్యమైన సంపద నీటిని కాపాడితేనే భవిష్యత్తు తరాలకు ప్రకృతి సంపాదనకు అందించినట్టే, వర్షపు నీటిని ఒడిసిపట్టుదాం నీటి భద్రతతో కూడిన భవిష్యత్తును నిర్మిద్దాం .




**- డాక్టర్. వై. సంజీవ కుమార్**
9393613555

# డిజిటల్ సంకెళ్లలో బాల్యం



సాంకేతిక విప్లవం సృష్టించిన స్మార్ట్‌ఫోన్ నేడు మానవ జీవితంలో ఒక అనివార్య భాగమైంది. అయితే ఇదే సాంకేతికత పసివాళ్ల పాలిట ఒక నిశ్శబ్ద శాపంగా మారుతోంది. ఆటపాటలతో, తోటి పిల్లలతో గడపాల్సిన వయసులో అంతులేని జ్ఞానాన్ని అందించాల్సిన మొబైల్ ఫోన్ నేడు చిన్నారులను తన గుప్పిట్లో బంధించి తీవ్రమైన వ్యసనంగా మారుతోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా గంటల తరబడి తెరల ముందే మునిగిపోతున్న నేటి తరం పిల్లల పరిస్థితి ప్రతి ఇంటా కనిపిస్తున్న చేదు నిజానికి అద్దం పడుతోంది. చిన్నపిల్లలు మొబైల్కు బానిసలుగా మారడం అనే అంశాన్ని కేవలం ఒక అలవాటుగా కాకుండా, బహుముఖ కోణాల్లో విశ్లేషించాల్సిన అత్యంత కీలకమైన సమయం ఇది.



నిరంతరం మొబైల్ తెరలను చూడటం వల్ల పిల్లల శారీరక ఎదుగుదల తీవ్రంగా ప్రభావితమవుతోంది. రాత్రివేళల్లో చీకటి గదుల్లో మొబైల్ వినియోగం కంటి ఆరోగ్యాన్ని దెబ్బ తీయడంతో పాటు నిద్రకు అవసరమైన హార్మోన్ల ఉత్పత్తిని అడ్డుకుంటుంది. ఫలితంగా పిల్లలు నిద్రలేమితో బాధపడుతున్నారు. ఆరుబయట ఆటలు తగ్గిపోవడం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల చిన్న వయసులోనే అధిక బరువు సమస్య పెరుగుతోంది. ఇది భవిష్యత్తులో మధుమేహం, గుండె జబ్బులకు దారితీసే ప్రమాదం ఉంది. అలాగే గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల మెడ నొప్పులు, వెన్నెముక సమస్యలు, నరాల బలహీనత వంటి ఇబ్బందులు కూడా చిన్న వయసులోనే ప్రారంభమవుతున్నాయి.

మొబైల్‌లో లభించే తక్షణ వినోదం పిల్లల మానసిక స్థితిని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. వేగవంతమైన చిన్నచిన్న దృశ్యాలు, ఆటలు, వినోద కార్యక్రమాలకు అలవాటుపడిన మెదడు తరగతి గదిలో పాఠాలపై దృష్టి కేంద్రీకరించలేకపోతోంది. ఫలితంగా ఏకాగ్రత తగ్గిపోతోంది. నిరంతరం మొబైల్ ఫోన్ల లోనే గడపడం వల్ల నిజ జీవితంలో మనుషులతో ఎలా మెలగాలో, భావాలను ఎలా వ్యక్తపరచాలో కొంతమంది పిల్లలకు తెలియడం లేదు. కొందరిలో మాట్లాడటంలో ఆలస్యం, స్పందనలో లోపం వంటి లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. అదేవిధంగా, ఆన్‌లైన్ ఆటల్లోని హింసాత్మక దృశ్యాలు పిల్లల్లో చిరాకు, కోపం, మొండితనం, దూకుడు ప్రవర్తన పెరగడానికి కారణమవుతున్నాయి.

మానవుడు సంఘజీవి. కానీ డిజిటల్ వ్యసనం పిల్లలను క్రమంగా ఒంటరితనంలోకి నెడుతోంది. తోటి పిల్లలతో కలిసి ఆడుకోవడం, గెలుపు- ఓటములను అంగీకరించడం, పరస్పర సహకారం వంటి సామాజిక విలువలను వారు కోల్పోతున్నారు. మొబైల్ తెరే వారి ప్రపంచంగా మారుతోంది. ఇతరుల పట్ల జాలి, కరుణ, పంచుకునే గుణం వంటి మానవీయ విలువలు కూడా క్రమంగా తగ్గిపోతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ సంక్షోభానికి కేవలం పిల్లలను మాత్రమే బాధ్యులను చేయలేం. ఇందులో కుటుంబ వ్యవస్థ, జీవనశైలి మార్పులు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. పిల్లలు ఏడుస్తున్నారని, అల్లరి చేస్తున్నారని చేతిలో ఫోన్ పెట్టడం నేటి తల్లిదండ్రులలో పెరుగుతున్న అలవాటుగా మారింది.

ఈ డిజిటల్ మహమ్మారి నుంచి పిల్లలను కాపాడాలంటే కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి పనిచేయాలి.రోజులో కొంత సమయం లేదా వారంలో ఒక రోజు మొబైల్లకు పూర్తిగా దూరంగా ఉండే అలవాటు కుటుంబ సభ్యులందరూ పెంచుకోవాలి. భోజన సమయంలో, నిద్రకు ముందు మొబైల్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలి. పిల్లలను సైక్లింగ్, ఈత, చిత్రలేఖనం, పుస్తక పఠనం, సంగీతం, క్రీడలు వంటి సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించాలి. ప్రకృతి, ఆటలు, స్నేహబంధాలే నిజమైన ఆనందాన్ని ఇస్తాయని వారికి అనుభవపూర్వకంగా తెలియజేయాలి. రెండేళ్ల లోపు పిల్లలకు మొబైల్ తెరలను పూర్తిగా దూరంగా ఉంచాలి. చిన్నారుల తెర సమయాన్ని ఖచ్చితంగా నియంత్రించాలి. పాఠశాలల్లో మొబైల్ వ్యసనంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పిల్లల్లో తీవ్రమైన ప్రవర్తనా మార్పులు కనిపిస్తే నిపుణుల సలహా తీసుకోవాలి.

మొబైల్ ఫోన్ ఒక అద్భుతమైన జ్ఞాన సాధనం. కానీ అది బాల్యాన్ని బంధించే సంకెళ్లుగా మారకూడదు. పచ్చని ప్రకృతి ఒడిలో, స్నేహితుల నవ్వుల మధ్య, ఆటపాటలతో వికసించాల్సిన బాల్యాన్ని డిజిటల్ గోడల మధ్య ఖైదు చేయడం భవిష్యత్తు సమాజానికే ప్రమాదకరం. పిల్లలకు ఖరీదైన పరికరాల కంటే విలువైన సమయం, ప్రేమ, ఆప్యాయతలను బహుమతిగా అందిద్దాం. నేటి బాల్యాన్ని కాపాడుకోవడం అంటే రేపటి సమాజానికి బలమైన పునాదులు వేయడమే. డిజిటల్ యుగంలో పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ఎంత ముఖ్యమో, దానికి హద్దులు పెట్టడం అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ప్రతి కుటుంబం గుర్తించాల్సిన అవసరం ఉంది.

**- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి**
9010128884

# సర్' ప్రక్రియపై నిర్లక్ష్యం వద్దు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, జూన్ 24 మనం న్యూస్ :** ఓటర్ల జాబితా పరిశీలన, సవరణలకు సంబంధించిన 'సర్' ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు, నియోజకవర్గాల పరిధిలో పార్టీ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి కార్యకర్తలు ఈ ప్రక్రియపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. బుధవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి, అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పలు కీలక అంశాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పార్టీ రాజకీయ విజయాలు కూడా ఈ ప్రక్రియ సమర్థవంతమైన అమలుపైనే ఆధారపడి ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపీఎల్‌కు రామ్‌చరణ్ మెరుపు

- యువ క్రికెటర్లకు గొప్ప వేదిక: గ్లోబల్ స్టార్
- ట్రోఫీ, జెర్సీల ఆవిష్కరణ.. ప్లేఆఫ్స్ రేసులో ఉత్కంఠ



**మంగళగిరి, జూన్ 24 (మనం న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2026 చివరి దశ మ్యాచ్లకు సినీ నటుడు, గ్లోబల్ స్టార్ రామ్చరణ్ హాజరుకావడంతో మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సందడిగా మారింది. ట్రోఫీతో పాటు జట్ల జెర్సీలను ఆవిష్కరించిన రామ్చరణ్, యువ క్రికెటర్లను అభినందిస్తూ వారితో మమేకమయ్యారు. అభిమానుల హర్షధ్వానాల మధ్య జరిగిన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా రామ్చరణ్ మాట్లాడుతూ యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడంలో ఏపీఎల్ కీలక వేదికగా మారిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రతిభావంతులైన ఆటగాళ్లకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కే అవకాశాలను ఈ లీగ్ కల్పిస్తోందని పేర్కొన్నారు. టోర్నీలో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారుడు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల అభివృద్ధి కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు.బుధవారం జరిగిన మ్యాచ్లో భీమవరం బుల్స్, క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్లు తలపడగా, టాస్ గెలిచిన అమరావతి రాయల్స్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. మ్యాచ్ను వీక్షించేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీశ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

**ప్లేఆఫ్స్కు పోటీ తీవ్రం**

ఈ నెల 24 నుంచి 27 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం, సాయంత్రం మ్యాచ్లు నిర్వహించనున్నారు. 27తో లీగ్ దశ ముగియనుండగా, 28 నుంచి ప్లేఆఫ్స్ ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30న జరిగే ఫైనల్తో టోర్నీకి తెరపడనుంది. ఏడు జట్లు పోటీ పడుతున్న ఈ టోర్నీలో భీమవరం బుల్స్ ఆరు మ్యాచ్లో ఎనిమిది పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లే ప్లేఆఫ్స్కు అర్హత సాధించనున్న నేపథ్యంలో మిగిలిన మ్యాచ్లపై ఆసక్తి నెలకొంది. యువ ఆటగాళ్ల ప్రతిభ, అభిమానుల ఆదరణ, ప్రముఖుల హాజరుతో ఏపీఎల్ చివరి దశ పోటీలు మరింత ఉత్కంఠభరితంగా మారాయి.

# హర్మూజ్లో ఎటువంటి సుంకాల్లేవ్ - ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 24:** హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. జలసంధి మార్గంలో ప్రయాణించే నౌకల నుంచి ఎటువంటి సుంకాలు, బీమా ఖర్చులు లేదా ఇతర ఏవిధమైన రుసుములూ వసూలు చేయమని ఇరాన్ హామీ ఇచ్చిందన్నారు. ఒకవేళ ఇది తప్పుడు సమాచారమైతే, వారితో చర్చలను వెంటనే నిలిపివేస్తామన్నారు.

ఇక ఇరాన్‌కు నేరుగా ఎటువంటి నిధులు విడుదల చేయడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. మొక్కజొన్న, గోధుమ, సోయాబీన్ తదితర ఆహార పదార్థాలను కొనుగోలు చేసేందుకు వారికి సంబంధించిన నిధుల్లోంచి కొంత మొత్తాన్ని అమెరికా రైతులు, పశుపోషకులకు విడుదల చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇరాన్‌కు ఆహార పదార్థాలు అత్యవసరమని, వాటిని ప్రత్యేకంగా అమెరికా నుంచే కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు.

హర్మూజ్‌లో ఇటీవల ట్రాఫిక్ పెరిగిందని, రికార్డు స్థాయిలో చమురు రవాణా జరుగుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. వీటికి సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఓ అమెరికా వార్తా సంస్థ పేర్కొన్న వివరాల ప్రకారం జూన్ 12-14 తేదీల్లో 32 నౌకలు హర్మూజ్‌ను దాటగా 19-21 తేదీల్లో 93 నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు తెలుస్తోంది.

# గిరి పౌర్ణమి మహోత్సవాల నిర్వహణపై సమన్వయ సమావేశం





**సింహాచలం, జూన్ 24 మనం న్యూస్ :** సింహాచల క్షేత్రంలో జూలై 28, 29 తేదీలలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న గిరి పౌర్ణమి మహోత్సవాల ఏర్పాట్లపై నేడు దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ జల్లేపల్లి వెంకటరావు అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కార్యనిర్వహణాధికారి అధికారులకు సూచించారు. గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, విశ్రాంతి కేంద్రాలు, అన్నప్రసాద పంపిణీ, మొబైల్ టాయిలెట్లు, అత్యవసర సేవలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.ప్రత్యేకంగా గిరి ప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య బృందాలు, తాగునీటి కేంద్రాలు, లైటింగ్ వ్యవస్థ, ట్రాఫిక్ మళ్లింపులు, భక్తుల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.భక్తులు సౌకర్యవంతంగా గిరి ప్రదక్షిణ నిర్వహించుకునేలా అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, ప్రతి విభాగం తమకు కేటాయించిన పనులను సమయానుకూలంగా పూర్తి చేయాలని కార్యనిర్వహణాధికారి ఆదేశించారు.ఈ సమావేశంలో దేవస్థాన అధికారులు, ఇంజినీరింగ్, ఆరోగ్య, విద్యుత్, ట్రాఫిక్, పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొని గిరి పౌర్ణమి మహోత్సవాల విజయవంత నిర్వహణకు తమ సహకారం అందిస్తామని తెలిపారు.

# కోటవురట్ల మండలంలో పేకాట ఆడుతున్నవారిపై పోలీసుల మెరుపు దాడి

- ఏడుగురు అరెస్ట్, రూ.10,150 నగదు స్వాధీనం



**కోటవురట్ల, జూన్ 24 మనం న్యూస్ :** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు, నక్కపల్లి సి.ఐ రామకృష్ణ పర్యవేక్షణలో కోటవురట్ల పోలీసులు మండలంలో పేకాట రాయుళ్లపై ఉక్కుపాదం మోపారు. కోటవురట్ల ఎస్సై విజయ్ కుమార్ మరియు వారి సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఆర్.సి.పురం గ్రామ శివార్లలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై ఆకస్మిక మెరుపు దాడి నిర్వహించారు.అరెస్ట్ అయిన వారు: పేకాట ఆడుతున్న ఏడుగురు (7) వ్యక్తులను పోలీసులు రంగంలోకి దిగి రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు: నిందితుల వద్ద నుండి రూ.10,150/- నగదుతో పాటు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై కోటవురట్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా జూదం, పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి పనుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# అల్లూరి జిల్లాలో పల్స్ పోలియో జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం

- 0-5 సంవత్సరాలు లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరి వేయించాలి
- జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ



**అల్లూరి జిల్లా పాడేరు, జూన్ :24 మనం న్యూస్:** జిల్లా లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైన నిర్వహణ ఏర్పాటు కొరకు సంబంధిత జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ సిబ్బందితో కలసి ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి , వెలుగు/డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ , గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి , అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి , జిల్లా రోగ నిరోధక టీకాల అధికారి మరియు ఇతర సంబంధిత శాఖల అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈనెల 28 న జరుగనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం చేయాలని, జిల్లాలోని 0-5 సంవత్సరాల వయస్సు గల మొత్తం 85,676 మంది చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ప్రత్యేకంగా ఆమె తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో వైద్య మరియు ఆరోగ్య శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి కృష్ణమూర్తి నాయక్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రతాప్, డాక్టర్ విశ్వేశ్వర్ నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు పి.బి.కె పరిమళ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ రావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి జాన్సీరామ్ పడాల్, డిఆర్డిఏ పిడి మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎచ్చెర్ల నియోజకవర్గంకు గురుకుల పాఠశాల

**మంజూరుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గారికి ఎమ్మెల్యే ఈశ్వరరావు కృతజ్ఞతలు**

- ఎచ్చెర్ల ప్రజల చిరకాల కోరిక నెరవేర్చిన మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి,జూన్ 24 :** ఎచ్చెర్ల నియోజకవర్గానికి మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల మంజూరు కావడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం ఈ పాఠశాలను మంజూరు చేసింది. పేద, వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో గురుకుల పాఠశాల అవసరాన్ని మంత్రి అచ్చెన్నాయుడు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో గురుకుల విద్యాసంస్థ అవసరాన్ని సమగ్రంగా వివరించి ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ పాఠశాల మంజూరు బాలికల విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎచ్చెర్లను విద్యా కేంద్రంగా మరింత అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఈశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీలను అగ్రపథాన నిలబెడతాం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- బీసీ సంక్షేమానికి చరిత్ర ఎరుగని నిధులను కేటాయించాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లకు కృషి
- రూ.500 కోట్లతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు
- కొత్తగా మరో 10 ఎంజేపీల ఏర్పాటు
- ఇంటిని తలపించే సౌకర్యాలతో బీసీ హాస్టళ్ల నిర్వహణ
- సివిల్ సర్వీసెస్, మెగా డీఎస్సీ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇచ్చాం
- విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలో ప్రత్యేక బీసీ స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు నిర్ణయం
- ఈ సర్కిళ్ల ద్వారా గ్రూప్ 1, గ్రూప్ 2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందజేస్తాం
- కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుకు జగన్ కుట్రలు : మంత్రి సవిత

**అమరావతి,జూన్, 24,(మనం ప్రత్యేక ప్రతినిధి) :** సమాజంలో సగానికిపైగా ఉన్న బీసీలను రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అగ్రపథాన నిలపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించబోతున్నామని, కొత్తగా మరో 10 బీసీ గురుకులాలను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. బీసీ విద్యార్థులకు ఐఐటీ, నీట్ లో ప్రవేశానికి శిక్షణ పొందేలా రెండు ఎక్స్ లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ పథకం ద్వారా ఆధునిక పరికరాలు అందజేసి, బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నామని, దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీలకు ఆత్మగౌరవాన్ని నిలిపేలా చట్టాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖలో రెండేళ్ల ప్రగతిపై బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. బీసీలు సమాజానికి బ్యాక్ బోన్లు అని సీఎం చంద్రబాబు నమ్మారన్నారు. సమాజంలో సగానికిపైగా ఉన్న బీసీల అభ్యున్నతే లక్ష్యంగా అనేక పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ లో రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్ లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్ లో రూ.51 వేల కోట్లు కేటాయించామన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిధులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ కేటాయించలేదన్నారు. ఇదీ బీసీల సంక్షేమం పట్ల సీఎం చంద్రబాబునాయుడుకు, కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

**గురుకులాలతో బీసీలకు అత్యున్నత విద్య**

ప్రస్తుతం రాష్ట్రంలో 109 బీసీ గురుకులాలు ఉన్నాయని, కొత్తగా మరో 10 గురుకులాలను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. బడి బయట బీసీ బిడ్డలు ఉండకూడదన్న లక్ష్యంతో నూతన ఎంజేపీలు ఏర్పాటు చేయడమేకాకుండా, పదో తరగతి తరవాత డ్రా పౌట్లను నిరోధించడానికి ఆరు బాలిక గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే పది గురుకుల పాఠశాలలో అయిదు వేల మంది విద్యార్థులకు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. అప్ గ్రేడ్ చేస్తున్న ఆరు జూనియర్ కళాశాలల్లో 960 మంది విద్యార్థినులకు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. బీసీ బిడ్డలకు నీట్, ఐఐటీలో శిక్షణ కోసం టేకులోడు(శ్రీసత్యసాయి), సింహాచలం(విశాఖ) ఎంజేపీ గురుకులాల్లో రెండు ఎక్స్ లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతేడాది ట్రిపుల్ ఐటీకి 302 మంది బీసీ గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది 275 మంది ఎంపికయ్యారని, ఇంకా కౌన్సెలింగ్ జరుగుతోందని, మరింత మంది ఎంపికయ్యే అవకాశముందని మంత్రి సవిత ఆశాభావం వ్యక్తంచేశారు. 2014-19లో మంజూరు చేసిన గుడిబండ, గుండుమల, పులివెందుల, రొద్దం బీసీ గురుకులాలను తరవాత వచ్చిన జగన్ పక్కనపెట్టేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.30 కోట్లతో ఆయా గురుకులాల నిర్మాణాలు పూర్తిచేశామని, త్వరలోనే ఈ గురుకులాలను ప్రారంభించబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. రూ.26.71 కోట్లతో 62 ఎంజేపీ భవనాలను మరమ్మతులు చేస్తున్నామన్నారు. బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆహారభద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. గురుకుల విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్ తో పాటు ట్రాక్ షూట్లు అందజేస్తున్నామన్నారు. చెస్ లో బీసీ గురుకులాల విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేలా ఏపీ చెస్ అకాడమీ తో ఎంవోయూ కుదుర్చుకున్నామన్నారు. ఈ ఎంవోయూతో విద్యార్థులు చెస్ లో మరింత రాణించడమే కాకుండా, మానసిక ఒత్తిడిని జయించేందుకు వీలుకలుగుతుందని మంత్రి సవిత తెలిపారు.

**సొంతింటిని తలపించేలా హాస్టళ్ల నిర్వహణ**

బీసీ హాస్టళ్లలో విద్యార్థులను సొంతింటి మాదిరిగా సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో 998 బీసీ హాస్టళ్లు ఉన్నాయని, వాటిలో 85 వేల మంది విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ లో ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ సర్వేలో బీసీ హాస్టళ్ల నిర్వహణపై 78.02 మంది విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తంచేశారన్నారు. గత ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లను పట్టించుకున్న పాపానపోలేదని, 5 ఏళ్లలో మరమ్మతులకు రూపాయి కూడా ఇవ్వలేదని, కనీసం బీసీ బిడ్డల కడుపు నింపే డైట్ బిల్లులు చెల్లించలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, గత ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.110 డైట్ ఛార్జీలను చెల్లించిందన్నారు. 104 బీసీ హాస్టళ్లలో ఎస్ఆర్ శంకరన్ రిసోర్సు సెంటర్లను ఏర్పాటు చేశామని, ఎఫ్ఆర్సీ విధానం ద్వారా విద్యార్థుల హాజరు నమోదు చేసి, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టామన్నారు. రెండేళ్లలో రూ.80 కోట్లతో హాస్టళ్ల భవనాల మరమ్మతులు, మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు.రూ.6 కోట్లతో హాస్టళ్ల దోమ తెరలు ఏర్పాటు చేశామని, రూ.18 కోట్లతో వసతి గృహాలకు అవసరమైన వంట పాత్రలు విద్యార్థులకు అవసరమైన సామాగ్రి కొనుగోలు చేశామని తెలిపారు. వసతి గృహాల్లో రూ.16.85 కోట్లతో 772 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో పాటు నిరంతర విద్యకు 642 వసతి గృహాల్లో ఇన్వర్టర్ల ఏర్పాటు చేశామన్నారు. రూ.4 కోట్లతో బట్టలు ఆరేసే స్టాండ్లు, వాల్ హ్యాంగర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వసతి గృహ పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించుడానికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. 260 మంది కుక్ లు, కమాటీలను నియమించామని, త్వరలో మరో 142 మందిని నియమించబోతున్నామని తెలిపారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణకు 1,291 పారిశుధ్య సిబ్బందిని కూడా నియమిస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

**బీసీ బిడ్డలకు ప్రతిభా పురస్కారాలు**

కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని బీసీ బిడ్డలు అందిపుచ్చుకున్నారని, ఇటీవల వెల్లడైన టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు రాబట్టారని మంత్రి సవిత తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను కూడా అందజేశామన్నారు. గత సంవత్సరం కూడా ప్రతిభా పురస్కారాలు అందజేశామన్నారు. విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంపొందించడమే కాకుండా అత్యుత్తమ ప్రతిభను గుర్తించి గౌరవించడం కోసం ప్రోత్సహకాలను అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.




**బీసీ బిడ్డలకు ఉన్నత ఉద్యోగాలే లక్ష్యం**

బీసీ బిడ్డలు ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్న ఉద్దేశంతో సివిల్ సర్వీసెస్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.ఏటా వందమంది బీసీ అభ్యర్థులకు ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఇస్తున్నామన్నారు. గతేడాది మొదటి విడత సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ అందజేశామని, ప్రస్తుతం రెండో బ్యాచ్ కు శిక్షణిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉచిత కోచింగ్ తో పాటు, ఉచిత వసతి, ఉచిత భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్ కు కొందరు అభ్యర్థులు అర్హత పొందారని, మిగిలిన వారిలో కొందరు ఆర్.ఆర్.బి, బ్యాంకు, ఎస్ఐ, గ్రూప్ -2 పోస్టులు సాధించారని మంత్రి సవిత తెలిపారు. గతేడాది నిర్వహించిన మెగా డీఎస్సీ కొరకు ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందజేశామన్నారు. ఈ కోచింగ్ వల్ల 280 మంది టీచర్ ఉద్యోగాలు పొందారన్నారు. త్వరలో కూటమి ప్రభుత్వం మరో డీఎస్సీ ప్రకటించనుందని, ప్రకటన రాగానే డీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షల నిమిత్తం మూడు ప్రత్యేక బీసీ స్టడీ సర్కిళ్లను విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలలో ఏర్పాటుకు నిర్ణయించామన్నారు.

# గిరిజన రైతాంగానికి 90 శాతం సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీ...

**కుక్కునూరు, జూన్ 04 (మనం న్యూస్ ):** రైతు సేవా కేంద్రంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి ఆర్. బాలాజీ మరియు మండల తెదేపా అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరావు సమక్షంలో 90 శాతం రాయితీ పై లబ్ధి దారులయిన గిరిజన రైతులకు వరి విత్తనాలు పంపిణి చేసారు.. కుక్కునూరు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో 90 శాతం రాయితీ వరి విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగిందని ఏవో బాలాజీ తెలిపారు. బిపిటి - 5204, యంటియు -1061, 1064 ఈ మూడు రకాల వరి విత్తనాలు పొజిషన్ చేయడం జరిగిందన్నారు. రైతులు కేవలం 10 శాతం రేటు కట్టి వరి బస్తాలు తీసుకుని వెళ్ళవచ్చును అని, ఒక్క రైతుకి గరిష్టంగా 5 బస్తాలు వరకు ఇస్తామని, బిపిటి - 5204 రకం 25 కేజీల బస్తా రేటు - రూ. 108, యంటియు - 1061, 1064 రకాల 30 కేజీల బస్తా రేటు రూ. 130 లు చెల్లించి తీసుకోవచ్చునని తెలిపారు. వీటికి తోడుగా లబ్ధి పొందిన ప్రతి ఒక్క రైతు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు. అదే విధంగా గిరిజన రైతులు మాత్రమే వారి వారి పట్టా పుస్తకం, ఆధార్ కార్డ్ ల నకలు మరియు రైతు ఫోన్ నంబర్ తీసుకొని ఆయా సంబంధిత ఆర్బీకే లలో ఇచ్చిన యెడల విత్తనాలు తీసుకోవటానికి అవకాశం ఉందని తెలిపారు...అనంతరం రైతన్న మీకోసం కార్యక్రమం లో గడప గడపకు 2 సంవత్సరాల కూటమి ప్రభుత్వం ద్వారా వ్యవసాయ శాఖ నుండి అందిన పథకాలు, అన్నదాత సుఖీభవ పథకం మరియు రైత్వారి గా యూరియా సరఫరా చాలా సులభంగా ఉంటుందని ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు వివరించారు. బీజేపీ మండల కోశాధికారి వాడపల్లి లక్ష్మణాచార్యులు, రైతులు, కూటమి నాయకులు మరియు కుక్కునూరు -1 గ్రామ వ్యవసాయ సహాయకురాలు టి కుమారి పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థాన పాలకవర్గ సమావేశంలో 35 అంశాలకు ఆమోదం

- **అభివృద్ధి పనుల పేరుతో భారీ వ్యయాలకు గ్రీన్ సిగ్నల్... కాంట్రాక్టర్లకు లాభం చేకూరేలా అంచనాలా?**



**అన్నవరం, జూన్ 24, మనం న్యూస్ :** అన్నవరం దేవస్థానం కొండపై బుధవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో అభివృద్ధి పనులకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేవస్థానం పాలకమండలి సమావేశపు హాలులో నిర్వహించిన ఈ సమావేశానికి దేవస్థానం చైర్మన్ రోహిత్ అధ్యక్షత వహించగా, కార్యనిర్వాహణాధికారి (ఈవో) నల్లం సూర్య చక్రధర్ రావు సమక్షంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా దేవస్థానం పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఇంజనీరింగ్ మరియు ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన ప్రతిపాదనలను చర్చించారు. మొత్తం సుమారు 35 అంశాలను అజెండాలో ప్రవేశపెట్టగా, వాటన్నింటికీ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు సమాచారం. అయితే సమావేశంలో ఆమోదం పొందిన కొన్ని ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పనుల అంచనా వ్యయాలపై అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సంబంధిత పనుల వ్యయ ప్రతిపాదనలు సాధారణ మార్కెట్ ధరలతో పోలిస్తే అధికంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పనులకు రూపొందించిన అంచనాలు కాంట్రాక్టర్లకు అధిక లాభాలు సమకూర్చే విధంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం నిధులు భక్తుల విరాళాలు, హుండీ ఆదాయం ద్వారా సమకూరుతున్న నేపథ్యంలో ప్రతి రూపాయి పారదర్శకంగా ఖర్చు కావాల్సిన అవసరం ఉందని భక్తులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పనుల అంచనాలు రూపొందించే సమయంలో సాంకేతిక ప్రమాణాలు, మార్కెట్ రేట్లు, ప్రభుత్వ మార్గదర్శకాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకున్నారా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ఇక సమావేశంలో ఆమోదం పొందిన పనుల వివరాలు, వాటి అంచనా వ్యయాలు, టెండర్ విధానం వంటి అంశాలను దేవస్థానం బహిరంగంగా ప్రకటిస్తే పారదర్శకత పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజా ధనం వినియోగంలో జవాబుదారీతనం ఉండాలని, భవిష్యత్తులో పనుల అమలు ప్రక్రియపై కూడా పర్యవేక్షణ అవసరమని సూచిస్తున్నారు. అయితే పాలకవర్గం మాత్రం భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం, దేవస్థానం అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నట్లు సమాచారం. సమావేశంలో ఆమోదం పొందిన పనుల అమలు త్వరలో ప్రారంభమయ్యే అవకాశముంది

## గోదావరి వరదలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

- **పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించాలి**
- **మండల విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలి.**




**కుక్కునూరు, జూన్ 24( మనం న్యూస్ ):** గోదావరి వరదల నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సీపీఎం డిమాండ్ చేసింది. అలాగే పోలవరం ప్రాజెక్టు కారణంగా మొదట తరలించునున్న గ్రామాల నిర్వాసితులకు పునరావాస కేంద్రాల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు, ఉపాధి-ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరింది. స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో బుయ్యన శ్రీను అధ్యక్షతన జరిగిన సీపీఎం కుక్కునూరు మండల కమిటీ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి మాట్లాడుతూ ఈ డిమాండ్లు చేశారు. గోదావరి వరదల విషయంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పరిశుభ్రత, మహిళలు-పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆమె కోరారు. నిర్వాసితులకు నిత్యావసర సరుకులు ముందుగానే అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రాల్లో 25 రకాల మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చూపించాలని, కుకునూరు మండలాన్ని యూనిట్గా తీసుకుని నిర్వాసితులకు తగిన పరిహారం చెల్లించాలని కోరారు. అదేవిధంగా కుకునూరు మండలంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ముఖ్యంగా లో వోల్టేజ్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాత్రి సమయంలో కరెంటు పోతే మళ్లీ 24 గంటల వరకు విద్యుత్ రాని పరిస్థితులు ఉన్నాయని, ఈ సమస్యపై విద్యుత్ శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కమిటీ సభ్యులు పట్ల లక్ష్మయ్య షేక్ వలీ పాషా శ్యామల లక్ష్మణరావు పూలదాసు రమేష్ సీనియర్ నాయకులు షేక్ మహబూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టౌలు పంపిణీ చేసిన విప్



**ముమ్మిడివరం, జూన్ 24, మనం న్యూస్:** ముమ్మిడివరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ముమ్మిడివరం, కాట్రేనికోన మరియు ఐ.పోలవరం మండలాల పరిధిలో గల 252 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టౌలు పంపిణీ చేసిన శాసనసభ విప్,ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు.ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగేందుకు ఇండక్షన్ స్టౌలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి ఊపిరిగా ఉన్న దిబ్బ మాయం

కాలి దారిని తవ్వేసి సాగులోకి మార్చిన సరిహద్దు రైతులు.

ఐదు సెంట్ల ప్రభుత్వ భూమి కబ్జా అయినట్లు సర్వేలో తేల్చిన అధికారులు.

వ్యవసాయ అవసరాలకు తీవ్ర అంతరాయం.వెంటనే దిబ్బ పునరుద్ధరించకపోతే ఉన్నత స్థాయిలో పోరాటానికి రైతుల సిద్ధం.



**పోడూరు జూన్వ్వ 24 మనం న్యూస్ :** వ్యసాయంలో పంట ఎంత ముఖ్యమో, పొలానికి వెళ్లే దారి కూడా అంతే ముఖ్యమని రైతులు చెబుతుంటారు. పొలాల మధ్య ఉండే దిబ్బలు కేవలం మట్టిగుట్టలు కాదు.. రైతుల చెమటకు మార్గాలు, కూలీల అడుగులకు ఆధారం, పంటను ఇంటి వరకు చేర్చే జీవన రేఖలు. అలాంటి వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే ప్రభుత్వ భూములు కనుమరుగైతే రైతు కష్టం రెట్టింపు అవుతుంది. దారి లేకుంటే పంట ఉన్నా ప్రయోజనం లేదనే పరిస్థితి ఏర్పడుతుంది.పోడూరు మండలంలోని కవిటం, పి.పోలవరం గ్రామాలకు చెందిన పంట పొలాల సరిహద్దులో రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం ఎన్నో ఏళ్లుగా కాలి దారిగా ఉపయోగించుకుంటున్న సర్వే నెంబర్ 246లో సుమారు 80 మీటర్ల వెడల్పు, 300 మీటర్ల పొడవు కలిగిన దిబ్బ పూర్తిగా మాయం కావడం స్థానిక రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.గతంలో సుమారు 30 ఎకరాలకు చెందిన రైతులు ఈ దిబ్బ గుండా ధాన్యం తరలించడం, చేను దమ్ము పనులు చేయించుకోవడం, కూలీల రాకపోకలు, వ్యవసాయ యంత్రాల రవాణా తదితర వ్యవసాయ కార్యకలాపాలు సులభంగా నిర్వహించుకునేవారు. అయితే ఇటీవల సరిహద్దు రైతులు ఆ దిబ్బను పూర్తిగా తవ్వేసి వ్యవసాయ భూమిగా మార్చి సాగు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో మిగిలిన రైతులు తమ వ్యవసాయ అవసరాలు తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట కోతల సమయంలో ధాన్యం రవాణా నుంచి కూలీల రాకపోకల వరకు ప్రతి పనికీ అవరోధాలు ఏర్పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ అంశంపై వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే సుమారు ఐదు సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి సాగు చేస్తున్నారంటూ బాధిత రైతులు ఈ ఏడాది ఫిబ్రవరి 23న టీఆర్ఎస్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే సుమారు మూడు నెలల తర్వాత స్పందించిన అధికార యంత్రాంగం ఈరోజు స్థల పరిశీలన చేసి సర్వే నిర్వహించగా, ఐదు సెంట్ల భూమి కబ్జాకు గురైందని, దిబ్బ ఆనవాళ్లు లేకుండా పోయినట్లు నిర్ధారించినట్లు రైతులు తెలిపారు.అయితే అధికారులు కేవలం సర్వేతో సరిపెట్టకుండా, కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి యథాతథ స్థితికి తీసుకురావాలని, దిబ్బను వెంటనే పునరుద్ధరించేలా సంబంధిత రైతులకు ఆదేశాలు జారీ చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం మళ్లీ ఆ దారిని వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.లేకపోతే 30 ఎకరాలకు చెందిన దాదాపు 60 మంది రైతులమంతా ఏకమై రెవెన్యూ సంబంధిత శాఖ మంత్రులను కలిసి, అవసరమైతే నేరుగా ముఖ్యమంత్రిని ఆశ్రయించి తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల శ్రమకు దారిగా నిలిచిన దిబ్బ తిరిగి రావాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

# కొత్తూరులో పడకేసిన పారిశుద్ధ్యం

- **తాగునీరు,వీధి లైట్స్,డ్రైనేజీ సమస్యలతో ప్రజల అవస్థలు...**
- **పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు**
- **స్పందన లేదంటూ జనసేన నాయకుడు గొర్లి నాగేశ్వరరావు ఆగ్రహం...**



**శంఖవరం జూన్ 23 మనం ప్రతినిధి:** శంఖవరం మండలం లోని కొంతంగి కొత్తూరు గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల నుంచి అంతర్గత రహదారుల వరకు ఎక్కడ చూసినా మురుగునీరు నిల్వ ఉండటం, చెత్త కుప్పలు పేరుకుపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. వేసవి కాలం ముగిసే దశకు చేరుకున్నప్పటికీ గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మహిళలు, వృద్ధులు మంచినీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పేరుకుపోయిన చెత్త, నిల్వ నీటి కారణంగా దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు వైరల్ జ్వరాలు, ఇతర అంటువ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. రాత్రి పూట కొత్తూరు గ్రామంలో ప్రయాణించడానికి వీధిలైట్లు లేక అనేక ఇబ్బందులు గురి అవుతున్నారు. గ్రామ సమస్యలపై జనసేన పార్టీ నాయకుడు, రైల్వే బోర్డు డివిజనల్ సభ్యుడు గొర్లి నాగేశ్వరరావు పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గ్రామ ప్రజల తరఫున అనేకసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు గ్రామంలో వెంటనే డ్రైనేజీలను శుభ్రపరచడంతో పాటు చెత్త తొలగింపు చర్యలు చేపట్టి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే జనసేన పార్టీ తరఫున ఈ అంశాన్ని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి, జిల్లా స్థాయిలో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం అధికారులను ప్రశ్నిస్తూ, గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న గొర్లి నాగేశ్వరరావు గ్రామ ప్రజల తరఫున తన పోరాటాన్ని కొనసాగిస్తారని తెలిపారు.

## జిల్లా పంచాయతీ అధికారిగా అనురాధ



- **మర్యాద పర్యాకంగా కలిసి న జిల్లా పంచాయితీ అభివృద్ధి అధికారుల సంఘ ప్రతినిధులు**

**భీమవరం , జూన్ 24,మనం బ్యూరో :** పంచాయితీ అధికారి( డి జి పి ఓ ) గా అనురాధ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నూతన డి జి పి ఓ అనురాధ ను కార్యాలయం వద్ద పశ్చిమగోదావరి జిల్లా పంచాయితీ అభివృద్ధి అధికారుల సంఘం తరుపున ప్రతినిధులుమర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘం అధ్యక్షులు పాల శ్రీనివాస్ట్రెజరర్ సుంకర వెంకటేష్, సహాయకార్యదర్శిజీవిటీనాయుడుఉపాధ్యక్షులు పి .వీరాజు,సంయుక్త కార్యదర్శిజి .శ్రీనివాస్ ,ఫణీంద్ర, జిల్లాలో గల పంచాయితీ అభివృద్ధికి అధికారులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయవంతానికి అన్ని శాఖల సమన్వయం అవసరం

- **ఆదివారం ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి – ఎంపీడీవో బి.ఎస్.ఎల్. మంగ కుమారి.**



**పోడూరు, జూన్ 24 మనం న్యూస్ :** పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పోడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.ఎస్.ఎల్. మంగ కుమారి సూచించారు. పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆదివారం నిర్వహించనున్న కార్యక్రమంలో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. విద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, అంగన్వాడీ, విద్యుత్ శాఖలతో పాటు సంబంధిత అన్ని విభాగాలు భాగస్వామ్యంగా పనిచేసి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో విజయవంతం చేయాలని తెలిపారు. పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. డి. సుప్రజ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. అలాగే రెండవ, మూడవ రోజుల్లో ఇంటింటి సందర్శనలు నిర్వహించి చుక్కలు వేయించని పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు అందజేస్తామని వివరించారు.ఈ సమావేశంలో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పడాల నాగిరెడ్డి, ఎంఈఓ జి.వి. సూర్యనారాయణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాంబాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.బి.కె.ఎస్. రమేష్ రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వయసు పెంపులో పిపిఏసిసిఎస్ ఉద్యోగులకు మొండి చెయ్యి

- **ఉద్యోగుల్లో అసంతృప్తి జ్వాలలు**

**పాలకొల్లు, జూన్ 24,మనం ప్రతినిధి** ఏపీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ఎల్ ఎం బి లు, లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ వయసు పెంపులో ఏపీ ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది. రాష్ట్రవ్యాప్తంగా 2,200 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో దాదాపు 15 వేల మంది వరకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.. నిత్యం పూర్తిస్థాయిలో రైతులకు మాత్రమే సేవలందిస్తుంటారు. వీరి జీతాలు కూడా పరపతి సంఘాల లాభాలలో నుండి తీసుకుంటుంటారు. వీరందరికీ వయసు పెంచడం వల్ల ప్రభుత్వానికి కూడా ఎలాంటి భారం ఉండదు. అయినప్పటికీ వీరికి పదవి విరమణ వయసు పెంపులో అవకాశం లేకపోవడం దురదృష్టకరమని విమర్శలు వెలువెత్తుతున్నాయి. రైతులకు సేవలందించే సొసైటీ ఉద్యోగులు పట్ల సవతి తల్లి ప్రేమ కూ టమి ప్రభుత్వం ప్రదర్శించడం దారుణమని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఉద్యోగుల్లో అసంతృప్తి జ్వాలలు: రైతులకు నిత్యం కేవలం రైతులకు మాత్రమే సేవలందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొసైటీ ఉద్యోగులకు పదవి విరమణ వయసు పెంపులో అవకాశం కల్పించక పోవడం పట్ల చేసే ఉద్యోగుల లో అసంతృప్తి జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి ఎలాంటి భారం లేకపోయినా తమకు వయసు పెంపు ఎందుకు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీ ఉద్యోగులమని తాము కూడా ఉన్నామని సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడుకు తెలియకపోవడం అన్యాయం అంటున్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వానికి ఏమాత్రం భారం కానీ తమ రిటైర్మెంట్ వయసు 62 కు పెంచాలని, న్యాయం చేయాలి అని గ్రామీణ ప్రాంతాలలోని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం ఉద్యోగులు కోరుతున్నారు.

## అక్రమ రొయ్యల చెరువు తవ్వకంపై రైతుల ఫిర్యాదు

**కాట్రేనికోన జూన్ 24 మనం ప్రతినిధి:** కాట్రేనికోన గ్రామంలోని ఆర్.ఎస్. నెంబర్లు 407, 408 లలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న రొయ్యల చెరువుల తవ్వకాల వల్ల స్థానిక వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని స్థానిక రైతులు బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ రొయ్యల చెరువుల ఏర్పాటు వల్ల వాటి ఇరువైపులా ఉన్న ప్రధాన పంట బోదెలు, అలాగే ఎన్.కొత్తపల్లి కాలువ తీవ్రంగా కలుషితమయ్యే అవకాశం ఉందని, చెరువుల నుండి వెలువడే రసాయనాలతో కూడిన మురుగునీటిని ఈ కాలువల్లోకి వదలడం వల్ల సుమారు 350 ఎకరాల్లో విస్తరించి ఉన్న పచ్చని వరిచేలు, జీవనాధారమైన కొబ్బరి తోటలు పూర్తిగా నిర్వీర్యమైపోతాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఈ అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని, బాధిత రైతాంగం కోరారు.



# కేరళ డీజీపీ కుటుంబ సమేతంగా అన్నవరం సత్యదేవుని దర్శనం



**అన్నవరం, జూన్ 24, మనం న్యూస్ :** కేరళ రాష్ట్ర డీజీపీ రవాడ చంద్రశేఖర రావు కుటుంబ సమేతంగా బుధవారం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో వ్రతమాచరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందించి స్వామివారి కృపాకటాక్షాలు కలగాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు స్వామివారి ప్రసాదంతో పాటు జ్ఞాపికగా స్వామివారి చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు. ఆలయ విశిష్టత, ఆధ్యాత్మిక వాతావరణం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది.

ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## ఆకలి లేని ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే అన్న క్యాంటీన్ల ధ్యేయం

- **ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు**

**కాట్రేనికోన జూన్ 24 మనం ప్రతి నిధి:** ఆకలి లేని ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే అన్న క్యాంటీన్ ల ధ్యేయమని కాట్రేనికోన ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు కొనియాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కాట్రేనికోన అన్న క్యాంటీన్ ను ఆయన బుధవారం సందర్శించారు. పలువురితో మాట్లాడి భోజనం నాణ్యత గూర్చి ఆరాతీశారు. స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం టోకెన్ల వారీగా ఆన్లైన్ వివరాలు పరిశీలించారు, సదరు సందర్శనలో మండల పరిషత్ జూనియర్ సహాయంకులు పృథ్వి, కాట్రేనికోన పంచాయతీ కార్యదర్శి జె వి సత్యన్నారాయణ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్రేమ్‌వర్క్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ



- **వ్యవసాయ అధికారి పి గాంధీ**

**శంఖవరం జూన్ 24 మనం ప్రతినిధిః** రైతులకు జాతీయ ఎరువుల విక్రయ ఫ్రేమ్వర్క్ యాప్ ద్వారా అవసరమైన ఎరువులను పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. శంఖవరం లోని సొసైటీలో యాప్ ద్వారా బుక్ చేసుకున్న రైతులకు యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.రైతులు మరియు కౌలు రైతులు తమ పంటలకు కావాల్సిన వివిధ రకాల ఎరువులను యాప్ ద్వారా శంఖవరం మండలంలోనీ శంఖవరం,అన్నవరం, కత్తిపూడి గ్రామాల్లో ఉన్న షాపులలో మరియు చుట్టు పక్కల ఉన్న రౌతులపూడి,తునిలో ఉన్న షాపులలో కూడా ఇంటి వద్దే బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమం లో ఏ ఈ ఓ శ్రీనివాస్, సొసైటీ సిబ్బంది, వ్యవసాయ సహాయకుడు క్రాంతి,రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభం

- ఏపీలో పండని పంటలు లేవు... దొరకని ఖనిజాలు లేవు
- సీమకు పునర్ వైభవం... చరిత్ర పునరావృతం
- సీమకు గ్రోత్ ఇంజన్ గా జొన్నగిరి గోల్ ఫీల్డ్స్
- జొన్నగిరి ఇకపై స్వర్ణగిరి
- ఆభరణాల తయారీకి జ్యుయలరీ పార్క్ ఏర్పాటు చేస్తాం
- జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో సీఎం






**జొన్నగిరి, జూన్ 24మనం న్యూస్‌:** రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. జొన్నగిరి గోల్ ఫీల్డ్సులో బంగారం వెలికితీతతో సీమకు పునర్ వైభవం రానుందని అన్నారు. బుధవారం సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో పర్యటించారు. జొన్నగిరి గోల్ ఫీల్డ్సులో జియో మైసూర్ - డెక్కన్ గోల్ మైన్స్ సంస్థలు ఏర్పాటు చేసిన గోల్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బంగారం శుద్ధి కోసం బంగారు ఖనిజంతో కూడిన మట్టిని తీసుకెళ్లే భారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేలా సిమ్యులేటర్ యంత్రాలపై మహిళలకు, యువతకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని సీఎం సందర్శించారు. రూ.405 కోట్ల పెట్టుబడితో జొన్నగిరిలో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్ మైన్స్ సంస్థలు బంగారాన్ని మైనింగ్ చేసి, ప్రాసెస్ చేసి విక్రయించనున్నారు. జొన్నగిరి గోల్ ఫీల్డ్సులో తొలి ఏడాది 400 కేజీలతో మైనింగ్ ప్రారంభించి తదుపరి దశలో 900 కేజీలు, అనంతరం 2 టన్నుల వరకూ బంగారాన్ని ఉత్పత్తి చేసే ప్రాజెక్టును సీఎం ప్రారంభించారు. జియో మైసూర్ - డెక్కన్ గోల్ మైన్స్ సంస్థలు జొన్నగిరిలో తవ్వకాలు జరిపి ముడి ఖనిజం నుంచి బంగారం ఉత్పత్తి చేసే ప్రక్రియను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఉత్పత్తి యూనిట్లోని వేర్వేరు విభాగాలను పరిశీలించారు. బంగారు బిస్కట్లు సహా వివిధ రూపాల్లోని తుది ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ నుంచి తుది ఉత్పత్తి వరకూ జరిగే ప్రక్రియలను జియో మైసూర్ సంస్థ చైర్మన్ ప్రభాకరన్, ఎండీ నవీన్ లాల్ చంద్ర సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం మొదలైంది. ఈ సువర్ణ అధ్యాయానికి రతనాల సీమ రాయలసీమ కేంద్రమైంది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ గోల్ మైనింగ్ ప్రాజెక్టును లాంఛ్ చేయడం శుభపరిణామం. విస్తరణ యూనిట్ కు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ ప్రాజెక్ట్ చేపట్టిన సంస్థల యాజమాన్యాలకు, ఉద్యోగులకు, కార్మికులకు అభినందనలు. జొన్నగిరి ఘనత నేటిది కాదు. ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి కాలంలో ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా ఉన్న సువర్ణగిరే ఈనాటి జొన్నగిరి. వందల సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. ఇక్కడకు దగ్గరలో లభించిన అశోకుడి ఎర్రగుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చెబుతున్నాయి. రాయలసీమ అంటేనే రతనాల సీమ. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో సీమలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారు. ప్రపంచానికి కోహినూర్ వజ్రాన్ని అందించిన ఘనత మన రాష్ట్రానిదే. కాలక్రమేణా రాయలసీమ ఎడారిగా మారే పరిస్థితులు తలెత్తాయి. ప్రాజెక్టులు పూర్తి చేసి, సాగునీరు ఇచ్చి సీమకు మళ్లీ జీవం పోశాం. గోల్ మైనింగ్ తో సీమకు పూర్వ వైభవం వస్తుంది. ఈ ప్రాంతానికి జొన్నగిరి బదులు స్వర్ణగిరి అని పేరు పెట్టుకుందాం. 2047కు దేశాన్ని వికసిత్ భారత్ గా తయారు చేయాలన్నది ప్రధాని మోదీ కల. మన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తయారు చేయాలన్నది నా ఆశయం.అని ముఖ్యమంత్రి చెప్పారు.



## గోల్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో సీఎంతో పాల్గొన్న మంత్రి టీజీ భరత్ గుప్తా

**కర్నూలు జూన్ 24మనం న్యూస్‌:** గోల్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేసేందుకు కర్నూల్ జిల్లా జొన్నగిరికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా హెలిప్యాడ్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గోల్ మైనింగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మైనింగ్ జరిగే ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేలా సిమ్యులేటర్ యంత్రాలపై మహిళలకు, యువతకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని సీఎంతో కలిసి మంత్రి సందర్శించారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండవ ప్లాంటుకు శంకుస్థాపన చేశారు.

## మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- పారిశుద్ధ్య కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి
- పరిష్కారం కోసం జూలై 7న చలో విజయవాడ



**కర్నూలు జూన్ 24మనం న్యూస్ :** మున్సిపల్ కార్మికుల కనీస వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమాన పనికి సమాన వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. బుధవారం నాడు కలెక్టరేట్ నందు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నా ఉద్దేశించి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్. మునెప్ప,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతుందని, డైలీ వేజ్,ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోర్టు చెప్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని ఆరోపించారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

- 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి
- మంత్రాలయంలోని రివేరా ఫంక్షన్ హాల్లో భద్రతా విధులపై దిశానిర్దేశం చేసిన ఎస్పీ
- నంద్యాల ఎస్పీ సునీల్ షొరాణ్



**కర్నూలు జూన్ 24మనం న్యూస్:** ఈ నెల 25వ తేదీన మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి మంత్రాలయంలోని రివేరా ఫంక్షన్ హాల్లో నంద్యాల ఎస్పీ సునీల్ షొరాణ్ బుధవారం భద్రతా విధులపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు ఇతర కీలక ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో భాగంగా సువారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గారు, కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఉపేంద్ర బాబు , సీఐలు, ఎస్ఐలు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## బెస్తరపల్లి సచివాలయంకు చేరిన వేరుశనగ


వేరుశెనగకు రిజిస్ట్రేషన్ చేసిన రైతులకు అందని వేరుశనగ
మనం https://www.manamepaper.com/clip/266305 Ananthapuram (24-6-2026)

- మనం వార్తకు స్పందించిన ఉన్నతాధికారులు

**కుందుర్పి, జూన్ 24 మనం న్యూస్‌:** రిజిస్ట్రేషన్ చేయించుకొన్న రైతులుకు వేరుశెనగ బస్తాలు లారీ లోడును మండలంలోని బెస్తర పల్లి గ్రామ సచివాలయం కార్యాలయంకు బుధవారం చేరిందని ఆ గ్రామస్తులు తెలిపారు. ఈనెల 23న మనం దినపత్రికలో వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసిన రైతులకు అందని వేరుశెనగ అన్న వార్త కధనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. అయితే ఈ వార్తకు జిల్లా వ్యవసాయ శాఖా అధికారులు ఎట్టకేలకు వెంటనే స్పందించి బెస్తరపల్లి గ్రామా సచివాలయంకు వేరుశనగ బస్తాలు లారీ లోడు ద్వారా తరలించినట్లు ఆ గ్రామస్తులు,సిపిఐ నాయకులు, బికె, గోపాల్ తెలిపారు. వేరుశనగను అధికారులు వెంటనే తరలించి నందుకు రైతులుకు వేరుశెనగ రిజిస్ట్రేషన్ చేసిన వేరుశెనగ అందలేదని చికటిలో వున్న సమస్యను వెలుగులోకి అధికారులు దృష్టికి తీసుకొచ్చి మా సమస్యను పరిష్కరించడానికి మార్గం చూపినందుకు అధికారులుకు, మనం సినీయర్ పాత్రికేయులుకు రైతులు ,సిపిఐ నాయకులు , మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం చంద్రబాబుని కలిసిన గడ్డం సుబ్రహ్మణ్యం



**అనంతపురం, జూన్ 24, మనంన్యూస్ :** విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని బుధవారం అనంతపురం పట్టణం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అందులో భాగంగా గడ్డం సుబ్రహ్మణ్యం చంద్రబాబు నాయుడు ఇరువురు చాలాసేపు అనంతపురం జిల్లా పరిస్థితుల పైన చర్చించినట్టు తెలుస్తుంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుతో గడ్డం సుబ్రహ్మణ్యం జిల్లా పరిస్థితులు, పార్టీ కోసం అనునిత్యం కష్టపడినటువంటి పార్టీ కార్యకర్తల గురించి అనేక విషయాలు సీఎం చంద్రబాబు నాయుడుకి వివరించడం జరిగిందని, అనంతపురం జిల్లా నే కాకుండా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం ఎంతోమంది సెకండ్ గ్రేడ్ నాయకుల నుండి క్రింది స్థాయి జెండా మోసే కార్యకర్త వరకు పార్టీ అభివృద్ధి కోసం, గతంలోని వైయస్సార్సీపి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు, నిబంధనలు పెట్టినా వాటిని లెక్కచేయకుండా అహర్నిశలు కష్టపడి తెలుగుదేశం పార్టీ విజయం కోసం ఎంతో కష్టపడ్డారని, వారందరికీ మన ప్రభుత్వ హయాములో తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, సరైన న్యాయం చేయాలని కోరినట్లు తెలుస్తున్నది. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ కోసం, పార్టీ విజయం కోసం కష్టపడి పని చేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు సరైన గుర్తింపుతోపాటు, ప్రాధాన్యత ఉంటుందని గడ్డం సుబ్రహ్మణ్యం కు హామీ ఇచ్చినట్లు తెలుస్తున్నది. గడ్డం సుబ్రహ్మణ్యం ఎన్ని పార్టీలు వచ్చినా, ఎన్ని ప్రభుత్వాలు ఏర్పడిన అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం ఒక సీనియర్ నాయకుడుగా భావించకుండా ఒక సామాన్య కార్యకర్తగా పని చేసినటువంటి వ్యక్తి, ఇప్పుడు చంద్రబాబు నాయుడుని కలవడంతో జీవితంలో ఏదో ఒక కీలక పదవి ఇస్తున్నారేమో అన్న అనుమానాలు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వ్యక్తమవుతున్నాయి.

## భక్తి శ్రద్ధలతో సీతరాములు విగ్రహ ప్రతిస్టాపన



- ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి డాక్టర్ రఘువీరారెడ్డి

**మడకశిర,జూన్ 24,మనంన్యూస్:** జ మడకశిర నగర పంచాయతీ పరిధిలోని బ్యాగర్లపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సీతరాములు విగ్రహ ప్రతిస్టాపన కార్యక్రమంను బుధవారం భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా మాజీ మంత్రి,కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు,నీలకంఠాపురం దేవస్థానములు కమిటి చైర్మన్ డాక్టర్ రఘువీరారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు, యూత్స్, విగ్రహ ప్రతిస్టాపన కమిటి చైర్మన్ రఘువీరారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా అయన దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపించారు.మహా మంగళ హారతి,తీర్థ ప్రసాదం స్వీకరించారు. అనంతరం దేవస్థానం అర్చకులు వేద మంత్రాలతో శాలువా కప్పి,పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి దీవించారు.ఈ కార్యక్రమంలోమార్కెట్ యార్డు కమిటి మాజీ చైర్మన్ జి.ప్రభాక ర్ రెడ్డి, మడకశిర మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు టీవీఎస్ మంజునాథ్,లెక్చరర్ బేగార్లపల్లి నాగరాజు,నాయకులు డాక్టర్ రవిశంకర్,బాబు ప్రసాద్,సాయి, దేవస్థానం కమిటి నిర్వాహకులు, గ్రామస్తులు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

- జూనియర్ సివిల్ జడ్జి నిఖిల్ రెడ్డి



**హిందూపురం (మనం న్యూస్) జూన్ 24:** సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ లేని నవ సమాజ నిర్మాణానికి ఐక్యంగా కృషి చేద్దామని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి నారంరెడ్డి నిఖిల్ రెడ్డి సూచించారు. డ్రగ్స్ కు బానిసలు కావడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబాలు వీధిన పడతాయన్నారు. బుధవారం సప్తగిరి కళాశాలలో మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో విద్యాభ్యాసం సాగించాలన్నారు. డ్రగ్స్ బారినపడి ఆరోగ్యాన్ని దెబ్బ తీసుకోవడంతో పాటు పట్టుబడితే పోలీసు కేసుల్లో పేర్లు నమోదు అవుతాయన్నారు. అలా పేర్లు నమోదైన అభ్యర్థులకు ఏ ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత ఉండదన్నారు. తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాలకోర్చి విద్యాభ్యాసం కోసం పంపుతుంటారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత ఆశయాలతో విద్యాభ్యాసం సాగించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యా సంస్థల్లో తరచూ డ్రగ్స్ వాడకం వల్ల చోటుచేసుకుని దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని న్యాయమూర్తి సూచించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో డ్రగ్స్ లేని నవ సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని న్యాయమూర్తి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, న్యాయవాదులు ఫణి ,నవేరా, రవిచంద్ర, లోక్ అదాలత్ సిబ్బంది రాజా, పారా లీగల్ వాలంటీర్లు మార్గదర్శి మాళప్ప, గోపాలకృష్ణ, చంద్రకాంత్, గణేష్, శశి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్



**పెనుకొండ జూన్ 24 మనం న్యూస్ :** ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ రాహుల్ దేవ్ శర్మ బుధవారం పెనుకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐలు, ఎస్ఐలు మరియు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ... పెనుకొండ స్టేషన్ పరిధి కర్ణాటక సరిహద్దుకు సమీపంలో ఉండటంతో అక్రమ మద్యం రవాణా, విక్రయాలను అరికట్టేందుకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం దుకాణాల్లో ఉన్న మద్యాన్ని స్కాన్ చేయడంతో పాటు ఎక్సైజ్ ఐ యాప్ సహాయంతో క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు.అనంతరం సిబ్బంది సమస్యలను ఓపికగా విన్న ఆయన వాటి పరిష్కారానికి శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్టేట్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. నర్సింహులు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఈ. హర్ష యశస్కర్, సీఐ సృజన్ బాబు, ఎస్ఐలు రాజశేఖర్, రాముడు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెంచాలి



- సిసిఎల్ఏ వీడియో కాన్ఫరెన్సో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, జూన్ 24 మనం న్యూస్:** భూ రికార్డుల నిర్వహణను మరింత పారదర్శకంగా నిర్వహిస్తూ, పెండింగ్లో ఉన్న మ్యుటేషన్లు, రెవెన్యూ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన సిసిఎల్ఏ (చీఫ్ కమీషనర్ అఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ )వీడియో కాన్ఫరెన్సో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న భూ సర్వే పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సర్వేలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు జాప్యం లేని సేవలు అందించాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో నిర్దేశించిన గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియను పక్కాగా పూర్తి చేసి, ఆధునిక సాంకేతికతతో ఖచ్చితమైన సర్వే నిర్వహించాలని తెలిపారు. రీసర్వే పూర్తయిన వెంటనే అర్హులైన భూ యజమానులకు 100 శాతం పట్టాదారు పాస్ పుస్తకాలు ముద్రించి పంపిణీ చేయాలని ఆదేశించారు.

## పరిశ్రమల అనుమతులు వేగవంతం చేయాలి

- సింగిల్ డెస్క్ దరఖాస్తులకు కాలపరిమితిలోనే క్లియరెన్స్
- జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



**పుట్టపర్తి, జూన్ 24 మనం న్యూస్:** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగవంతంగా మంజూరు చేసి పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సులో కుదిరిన అవగాహన ఒప్పందాలు (ఎం ఓ యు లు), ఎస్ ఐ పి బి ఒప్పందాల అమలు పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పరిశ్రమలు త్వరగా ఉత్పత్తి దశకు చేరుకునేలా అవసరమైన అన్ని రకాల అనుమతులు సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, పరిశ్రమల స్థాపనలో ఎలాంటి జాప్యం చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పడుతున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవసరమైన వసతులు కల్పించాలని, వివిధ పారిశ్రామిక ప్రోత్సాహక పాలసీల కింద దరఖాస్తు చేసుకున్న యూనిట్లకు రాయితీలు సకాలంలో అందించాలని సూచించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం , పీఎం విశ్వకర్మ పథకాల కింద మంజూరవుతున్న రుణాల పురోగతిని సమీక్షించారు. అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో జిల్లాలోని ఎమ్మెస్ ఎం ఇ ల డిజిటల్ సర్వేలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వచ్చే నెల జులై 6న నిర్వహించనున్న 'ఆత్మనిర్భర్ భారత్ - రక్షణ, పర్యావరణ పరిశ్రమల ఎకోసిస్టమ్ ప్రమోషన్' అంశంపై రీజనల్ వర్క్షాప్ ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జీఎం, డిఐసి, జీఎం, ఏపీఐఐసీ, ఏ పి పి సి బి, ఎల్డిఎం నాబార్డ్ అధికారులు, పరిశ్రమల శాఖ ప్రతినిధులు, జిల్లా అధికారులు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు పాల్గొన్నారు

## జాబ్ మేళాలో 22మంది ఎంపిక

**నార్పల, జూన్ 24 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్ మరియు సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నార్పల లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా జాబ్ మేళా నిర్వహించటం జరిగింది. ఈ జాబ్ మేళాకి 10 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారుఈ జాబ్ మేళాకు సుమారు 53మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో 22 మంది ఎంపిక కావడం జరిగింది .ఈ యొక్క జాబ్ మేళ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. డేవిడ్ , జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, అలాగే స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆది నారాయణ, సీడాప్ సిబ్బంది కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.





## ఇంగ్లాండ్ టూర్.. భారత డ్రెస్సింగ్ రూమ్ లోకి వైభవ్ కు నో ఎంట్రీ..!

కేవలం 15ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లాండ్ లో స్వల్ప అవరోధం కలగనుంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వైభవ్ తోపాటు అతడి తల్లిదండ్రులు వెళ్లేందుకు బీసీసీఐ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఇంగ్లాండ్ లో మాత్రం వైభవ్ సూర్యవంశీకి భారత డ్రెస్సింగ్ రూమ్ లో ఉండే అవకాశం లేకుండా పోతుందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. దానికి కారణం అక్కడి నిబంధనలేనని తెలుస్తోంది. జులై 1 నుంచి ఇంగ్లాండ్ లో టీమ్ఇండియా పర్యటించనుంది. ఐసీసీ, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిబంధనల ప్రకారం 16 ఏళ్లలోపు ఆటగాళ్లకు ప్రత్యేక గదులు కేటాయిస్తారు. అయితే, ఈ విషయంపై బీసీసీఐ అధికారులు ఇంగ్లాండ్ బోర్డు ప్రతినిధులతో చర్చించే అవకాశం ఉంది.

''ఇది ఐసీసీ ఈవెంట్. వారి అధికార పరిధి ఉన్నందున భద్రతా విధానాలు అమల్లో ఉంటాయి. 16 ఏళ్లలోపు ప్లేయర్లు పెద్దల ఛేంజింగ్ రూమ్స్ ను వాడేందుకు అనుమతి లేదు. కాబట్టి, సూర్యవంశీకి ప్రత్యేకంగా గదిని కేటాయించే అవకాశం ఉంది. అతడితోపాటు తల్లిదండ్రులు కూడా వస్తారు. వారికి కూడా ప్రతి వేదిక వద్ద వసతి సదుపాయం కల్పిస్తాం. మ్యాచ్ సమయంలోనే వైభవ్ కు డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లేందుకు అనుమతి ఉంది. మ్యాచ్కు ముందు.. తర్వాత ఛేంజింగ్ కోసం వెళ్లడానికి అనుమతి ఉండదు'' అని ఈసీబీ క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

## మిడిలార్డర్, ఫీల్డింగ్ వైఫల్యాలను అధిగమిస్తేనే..

మహిళల ప్రపంచ కప్ లో వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న టీమ్ ఇండియాకు.. దక్షిణాఫ్రికా రూపంలో షాక్ ఎదురైంది. ఈ ఓటమిలో స్వయంకృతాపరాధాలదే ప్రధాన పాత్ర. గురువారం బంగ్లాదేశ్ తో కీలక మ్యాచ్ జరగనుంది. మిడిలార్డర్తోపాటు ఫీల్డింగ్ వైఫల్యం నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది.



ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, నెదర్లాండ్స్ తో కూడిన గ్రూప్ అలో టీమ్ఇండియా ఉంది. ఇప్పటికే పాక్, నెదర్లాండ్స్ ఇంటిముఖం పట్టాయి. అన్ని జట్ల కంటే ఆసీస్ (8 పాయింట్లు) టాప్ లో ఉంది. ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ గెలిచింది. ఇక భారత్ (4 పాయింట్లు) మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక ఓటమితో రెండో స్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా (4), బంగ్లాదేశ్ (4) కూడా సేమ్ పాయింట్లతో ఉన్నాయి. కానీ, నెట్ రన్ రేట్ మాత్రం టీమ్ఇండియాదే ఎక్కువ. భారత్ ఇంకా రెండు మ్యాచులు ఆడాలి. అదీనూ బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాపైనే. రెండూ గెలిస్తే తిరుగులేకుండా సెమీస్ కు చేరుకోవచ్చు. ఒక్కటి ఓడినా.. నెట్ రన్ రేట్ కీలకమవుతుంది. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఇప్పుడు బంగ్లాపై భారీ విజయం నమోదు చేయాలి.

షెఫాలీ వర్మ లేదా స్మృతి మంధాననే పరుగులు చేయాలి అన్నట్లుగా ఉంది భారత పరిస్థితి. మిగతా బ్యాటర్ల నుంచి సహకారం పెద్దగా లభించడంలేదు. ఆఖర్లో రిచా ఘోష్ దూకుడుతో ఫినిషింగ్ టచ్ ఇస్తోంది. కానీ, మిడిల్ ఆర్డర్ నుంచి ఆశించిన పరుగులు రావడం లేదు. జెమీమా రోడ్రిగ్స్ ఆటతీరు గొప్పగా లేదు. ఓపెనర్లు రాణించినప్పటికీ.. ఆ తర్వాత వచ్చే జెమీమా ఆ దూకుడును కొనసాగించలేకపోతోంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కూడా భారీ ఇన్నింగ్స్ బాకీ ఉంది. బంగ్లాదేశ్ తో మ్యాచ్ లో వీరిద్దరూ రాణించాల్సి ఉంది.

క్యాచులు ఎంత కీలకమో..

'క్యాచెస్ విన్ మ్యాచెస్'.. అంటే ఇప్పుడు భారత జట్టుకు బాగా తెలిసి ఉంటుంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ లో కాప్ ఇచ్చిన క్యాచ్ ను జారవిడవడంతో టీమ్ఇండియాకు ఓటమి తప్పలేదు. ఫీల్డింగ్ లోనూ గొప్ప ప్రదర్శన చూపించకపోవడం విమర్శలకు దారితీసింది. తదుపరి మ్యాచ్ లోనూ ఫీల్డింగ్ మెరుగు కాకపోతే భంగపాటు తప్పదు. ఇప్పుడీ మ్యాచులు నాకౌట్ లాంటివే. ఒక్కటి ఓడినా ఇబ్బందుల్లో పడినట్లే.

భారత్ కు ప్రధాన ఆయుధం స్పిన్. దాంతోనే రెండు మ్యాచుల్లో గెలిచింది. మూడో మ్యాచ్ లోనూ దక్షిణాఫ్రికాను ఓడించే అవకాశం వచ్చినా చేజారింది. మహిళల బౌలింగ్ విభాగంలో అగ్రస్థానానికి చేరిన తెలుగు అమ్మాయి శ్రీ చరణి మూడు మ్యాచుల్లోనూ అదరగొట్టింది. ప్రస్తుతం ఈ వరల్ కప్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో శ్రీచరణి టాపర్. మూడు మ్యాచుల్లో 10 వికెట్లు పడగొట్టింది. అయితే, ఆమెకు తోడుగా నిలిచే స్పిన్నర్ లేదా పేసర్ నిలకడ చూపించడం లేదు. దీప్తి శర్మ ఒక మ్యాచ్ లో ఐదు వికెట్ల ప్రదర్శన మినహా.. మిగతా రెండింట్లో ప్రభావం చూపించలేదు. ఇక పేసర్ల పరిస్థితి దయనీయం. అత్యధిక వికెట్లు తీసిన టాప్ -15 బౌలర్లలో భారత్ నుంచి శ్రీచరణి, దీప్తి మాత్రమే ఉండటం గమనార్హం.



## రొనాల్డో అదరహో..

### ఉజ్బెకిస్థాన్ పై పోర్చుగల్ విజయం

పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో చరిత్ర సృష్టించాడు. ఆరు ప్రపంచకప్పుల్లో స్కోర్ చేసిన తొలి ఫుట్ బాలర్ గా ఘనత సాధించాడు. రొనాల్డో (6వ, 39వ) రెండు గోల్స్ కొట్టడంతో మంగళవారం గ్రూప్-కె మ్యాచ్ (గ్రూప్-కె)లో పోర్చుగల్ 5-0తో ఉజ్బెకిస్థాన్ పై ఘనవిజయం సాధించింది. నునో మెండెస్ (17వ), రఫేలియో (87వ) పోర్చుగల్ కు చెరో గోల్ అందించారు. ఉజ్బెకిస్థాన్ ఆటగాడు నెమతోవ్ (60వ) ఓ సెల్ఫ్ గోల్ చేశాడు. ఈ మ్యాచ్ లో పోర్చుగల్ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. గోల్ పై పదే పదే దాడులు చేస్తూ ఉజ్బెకిస్థాన్ డిఫెన్స్ ను ఒత్తిడికి గురి చేసింది. కాంగో డీర్ తో ఆడిన తొలి మ్యాచ్ ను పోర్చుగల్ 1-1తో డ్రాగా ముగించిన సంగతి తెలిసిందే.

## 'వారణాసి' షూట్‌కి మహేష్ బ్రేక్..



దర్శకధీరుడు రాజమౌళి - మహేష్ బాబు కలయికలో రాబోతున్న సినిమా 'వారణాసి'. ఐతే, మహేష్ బాబు గత కొన్ని నెలలుగా 'వారణాసి' షూటింగ్ లో బిజీగా ఉన్నారు. కానీ, ఇప్పుడు, మహేష్ బాబు తన భార్య నమ్రత, పిల్లలు గౌతమ్, సితారలతో కలిసి ఒక చిన్న విహారయాత్రకు బయలుదేరుతూ, ఆర్జీఐఏ విమానాశ్రయంలో కనిపించారు. వారు విమానాశ్రయంలో కనిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో, మహేష్ బాబు 'వారణాసి' షూటింగ్ నుండి కొద్దికాలం విరామం తీసుకున్నారని క్లారిటీ వచ్చింది.

మళ్లీ మహేష్ జూలై 1, 2026 నాటికి తిరిగి వారణాసి షూట్ లో జాయిన్ అవుతారని తెలుస్తోంది. అన్నట్టు మహేష్ అభిమానులకు ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ కనుల విందుగా ఉంటుందని టాక్. ప్రియాంక ఈ సినిమాలో మందాకినిగా కనిపిస్తూ ఉండగా.. మహేశ్ రుద్రగా.. శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కాగా 'వారణాసి' చిత్రం రూ.1300 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో నిర్మితమవుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్ ను కెఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు.

ఇప్పటికే విడుదలైన టీజర్ కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, కథ కథనాన్ని విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. ఇక ఈ సినిమాకి దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు. ఈ సినిమాను పూర్తిగా ఐమాక్స్ ఫార్మాట్లో చిత్రీకరిస్తుండగా, పలు భాషల్లో విడుదల చేయనున్నారు.



## 'రవితేజ'తో యంగ్ బ్యూటీ స్పెషల్ సాంగ్ ?

హీరో రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఇరుముడి చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఐతే, తాజాగా ఈ సినిమా గురించి వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ను డిజైన్ చేశారు. ఈ సాంగ్ కోసం యంగ్ బ్యూటీ నభా నటేష్ ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. కమర్షియల్ ఎలిమెంట్స్ ను దృష్టిలో పెట్టుకుని శివ నిర్వాణ ఈ సాంగ్ ను పెట్టాడట. అన్నట్టు నభా నటేష్ ది కేవలం స్పెషల్ సాంగ్ మాత్రమే కాదు అని, ఆమెది ఒక గెస్ట్ రోల్ అని తెలుస్తోంది.

ముఖ్యంగా రవితేజ – నభా పాత్రల మధ్య కొన్ని సన్నివేశాలు కూడా ఉంటాయట. ఇక 'కొన్ని కథలు జీవితంలో సరైన సమయంలో మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి ఒక కథే ఈ ఇరుముడి. ఇందులో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. కొత్త ప్రయాణంలో ఉత్సాహంగా ఉన్నా'' అని రవితేజ ఆ మధ్య చెప్పుకొచ్చారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాలో కథానాయికగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా.. జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో బేబీ నకాస్త్ర రవితేజ కుమార్తెగా నటిస్తోంది.

## దక్షిణాదిలో అంతగా ప్రశంసలు ఉండవు: తమన్నా



బాలీవుడ్ తో పోలిస్తే దక్షిణాది సినిమాల్లో మహిళా నటీమణులకు అంతగా ప్రశంసలు ఉండవని, హీరోలకి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందంటున్నారు నటి తమన్నా. సుమారు రెండు దశాబ్దాలుగా వివిధ భాషల్లో నటిస్తున్న ఆమె.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దక్షిణాది, బాలీవుడ్ పరిశ్రమల మధ్య ఉన్న తేడాను వివరించారు. ''హిందీలో ప్రధానంగా రెండు రకాల నటులుంటారు. నటనకు ప్రాధాన్యమిచ్చే వారు. గ్లామరస్ పాటలకు, డ్యాన్సులకు ఆసక్తి చూపేవారు. హిందీ చిత్ర పరిశ్రమలో ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేసేవారే అక్కడ సూపర్స్టార్లు అవుతారు. కానీ, సౌత్లో కమర్షియల్ సినిమాలకు ఒక నిర్దిష్టమైన ఫార్మాట్ ఉంటుంది. ఇక్కడ పితృస్వామ్య భావజాలం ఎక్కువ. హీరోయిన్లను చూసే విధానం అంత ప్రశంసనీయంగా అనిపించదు. సౌత్ లోకి అడుగుపెట్టాకే నాకు అక్కడి పరిస్థితి అర్థమైంది. ఇది కేవలం నా వ్యక్తిగత అనుభవం మాత్రమే. ఇతరులకు భిన్నమైన అభిప్రాయాలు ఉండొచ్చు. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతో పాటు కమర్షియల్ హంగులను సమన్వయం చేసుకున్న నటీమణులే 10 నుంచి 15 ఏళ్ల పాటు కెరీర్ ను కొనసాగించగలరు'' అని విశ్లేషించారు.

ఇక, ప్రస్తుతం ఆమె 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' సినిమాలో నటిస్తున్నారు. దీపక్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరో. మనీష్ పాల్, సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 ఆగస్టు 26న థియేటర్లలోకి రానుంది. అదే రోజు శ్రద్ధా కపూర్ 'ఈత', యశ్ 'టాక్సిక్' చిత్రాలు కూడా బరిలో ఉండటంతో బాక్సాఫీస్ వద్ద పోటీ నెలకొననుంది.

## రామ్ పోతినేని నెక్స్ట్ ప్రాజెక్ట్ బడ్జెట్‌పై ఇంట్రెస్టింగ్ బజ్.. ఏకంగా అంతా..?

యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని కెరీర్ లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. రాపో సినిమాటిక్స్ బ్యానర్ పై నిర్మాత కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్తో నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఈ సినిమాను రామ్ కెరీర్ లో ముందెన్నడూ లేని విధంగా అత్యంత భారీ స్కేల్ లో, అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తుండటం విశేషం.



అయితే, ఈ సినిమా కోసం ఏకంగా రూ.100 కోట్ల బడ్జెట్ ను కేటాయించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం కోసం టాలీవుడ్ లోని స్టార్ టెక్నీషియన్స్ రంగంలోకి దిగారు. ఈ చిత్రానికి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరు విజువల్స్ అందిస్తున్నారు. అలాగే టాప్ యాక్షన్ కొరియోగ్రాఫర్ అయిన పీటర్ హెయిన్ ఈ సినిమా కోసం హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ లను డిజైన్ చేస్తుండగా, ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్ హైదరాబాద్ శివార్లలో భారీ సెట్లను నిర్మిస్తున్నారు.

కళ్లు చెదిరే యాక్షన్ ఎపిసోడ్స్, గ్రాండ్ ప్రొడక్షన్ డిజైన్, టాప్ టెక్నీషియన్స్ కలయికలో వస్తున్న RAPO23 రామ్ పోతినేని కెరీర్ లో ఒక మైలురాయిగా నిలిచిపోనుందని తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మిగతా నటీనటుల వివరాలను అధికారికంగా వెల్లడించనున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.